# నవజ్యోతి
తెలుగు దిన పత్రిక

ప్రచురణ : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్   సంపుటి : 1   సంచిక : 86   ఎడిటర్: ఎం.లక్ష్మణ్   వెల 5/-   గురువారం   8-1-2026   పేజీలు: 8


**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం బాలికల పాఠశాల అభివృద్ధికి చర్యలు**

**మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు**

సినిమాలో..

## విశ్వవిద్యాలయాల్లో స్థిరాస్తి దందా

### మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, (నవజ్యోతి ప్రతినిధి):

రాష్ట్రంలో చదువులకు నిలయమైన విశ్వవిద్యాలయాల్లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం స్థిరాస్తి దందా చేస్తోందని భారాస నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. విద్యా వ్యవస్థను, విశ్వవిద్యాలయాలను నిర్వీర్యం చేస్తూ భావితరాల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నారన్నారు. ఈ మేరకు బుధవారం 'ఎక్స్' వేదికగా ఆయన పోస్టు చేశారు. 'ఇటీవల ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం నుంచి బలవంతంగా 100 ఎకరాలకు పైగా భూములను లాక్కున్నారు. 60 ఏళ్లుగా ఎంతో కష్టపడి కాపాడుకుంటూ వస్తున్న ఔషధ, సుగంధ మొక్కల పరిశోధన కేంద్రంలోని 60 ఎకరాలను పూర్తిగా ధ్వంసం చేశారు.



హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాలకు పైగా అటవీ భూమిని తాకట్టు పెట్టి విధ్వంసం చేశారు. తాజాగా మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయానికి చెందిన 50 ఎకరాలపై ప్రభుత్వం కన్నుపడింది. భవిష్యత్తు తరాలకు జ్ఞానాన్ని అందించాల్సిన చోట, ఆవిష్కరణలకు ఊపిరి పోయాల్సిన చోట ఇలా భూములను లాక్కోవడం దేనికి సంకేతం? విద్యా సంస్థల భూములను కూడా రియల్ ఎస్టేట్ వెంచర్లుగా చూస్తారా?' అంటూ హరీశ్‌రావు ప్రశ్నించారు.

## తమిళనాడు, పుదుచ్చేరి ఎన్నికల పరిశీలకుడిగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

దిల్లీ, (నవజ్యోతి ప్రతినిధి):

త్వరలో జరగబోయే తమిళనాడు, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్ వ్యవహారాల పర్యవేక్షకుడిగా తెలంగాణ నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ రాష్ట్రాలకు ఉత్తమ్‌తో పాటు పార్టీ సీనియర్ నేతలు ముకుల్‌వాస్నిక్, ఖాజీ మహమ్మద్ నిజాముద్దీన్‌లను పరిశీలకులుగా నియమించినట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వీటితో పాటు ఏఐసీసీ నుంచి కేరళ, అస్సాం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు ముగ్గురేసి పరిశీలకులను నియమించారు.



## అసెంబ్లీలో కాంగ్రెస్ తీరు అప్రజాస్వామికం: కేపీ వివేకానంద

హైదరాబాద్, (నవజ్యోతి ప్రతినిధి):

అసెంబ్లీ సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీ పూర్తి అప్రజాస్వామికంగా వ్యవహరించిందని భారాస విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానందగౌడ్ మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి సభా సంప్రదాయాలను పాటించకపోవడంతో పాటు, సభా హక్కులను ఉల్లంఘించారని ఆరోపించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో విలేకరులతో వివేకానంద మాట్లాడారు. హిల్ట్ పాలసీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎవరితో చర్చించకుండానే జీవో తెచ్చిందన్నారు. జీరో అవర్‌తో సమావేశాలు ప్రారంభించి.. జీరో డిస్కషన్‌తో ముగించారని, ఎలాంటి ఫలవంతమైన చర్చ జరగలేదని విమర్శించారు. ఇతర అంశాల్లో రాష్ట్ర మంత్రుల మధ్య సమన్వయం ఉందో లేదో గానీ భారాస అధినేత కేసీఆర్‌ను తిట్టడంలో మాత్రం వాళ్లు పోటీ పడ్డారని పేర్కొన్నారు. శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రిగా శ్రీధర్‌బాబు విఫలమయ్యారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి అభ్యంతరకర భాషతో శాసనసభ స్థాయిని దిగజార్చారని మండిపడ్డారు.



## ఏప్రిల్‌లో మరో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ

### గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

2





## 'సీఎం కప్-2025' సెకండ్ ఎడిషన్ పోస్టర్‌ను ఆవిష్కరించిన సీఎం

హైదరాబాద్, (నవజ్యోతి ప్రతినిధి):

'సీఎం కప్-2025' సెకండ్ ఎడిషన్ పోస్టర్‌ను బుధవారం ముఖ్యమంత్రి తన నివాసంలో క్రీడలశాఖ మంత్రి శ్రీహరి, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి, ఎండీ సోనీబాల, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్, సీఎం ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజుతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. జనవరి 17 నుంచి ఫిబ్రవరి 26 వరకు గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఈ పోటీలు జరగనున్నాయి. మొత్తం 44 రకాల క్రీడలను నిర్వహిస్తారు.

## ప్రఖ్యాత ప్లాస్టిక్ సర్జన్.. డీఎల్ఎన్ ప్రసాద్ కన్నుమూత

### ఉమ్మడి రాష్ట్రంలో తొలి ప్లాస్టిక్ సర్జరీ విభాగం




## భారీగా ఐపీఎస్ అధికారుల బదిలీ

### నాలుగు కమిషనరేట్లలో సర్దుబాట్లు

### హైదరాబాద్ కమిషనరేట్ పరిధి రెండు రేంజ్‌లుగా విభజన

హైదరాబాద్, (నవజ్యోతి ప్రతినిధి):

రాష్ట్రంలో పలువురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. సిద్దిపేట కమిషనరేట్ మినహా మిగతా బదిలీలన్నీ రాజధాని పరిధిలోని కమిషనరేట్లకు చెందినవే కావడం గమనార్హం. ఫ్యూచర్ సిటీ పేరుతో కొత్తగా కమిషనరేట్ ఏర్పాటు చేయగా.. రాచకొండ కమిషనరేట్ పేరును మల్కాజిగిరిగా మార్చారు. సైబరాబాద్, హైదరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్లను పునర్వ్యవస్థీకరించారు. ఫ్యూచర్ సిటీ కమిషనరేట్‌లో కొత్త ప్రాంతాలను కలిపారు. నాలుగు కమిషనరేట్ల పరిధిలోని కొన్ని జోన్ల పేర్లు, సరిహద్దులను మార్చారు. కొన్ని జోన్ల పేర్లు యథతథంగానే ఉన్నప్పటికీ వాటి కమిషనరేట్లు మారాయి. ఇటువంటి మార్పులను కూడా బదిలీల్లో చూపారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధి పెరగడంతో పరిపాలనా సౌలభ్యం కోసం రెండు రేంజ్‌లుగా విభజించి, ఇద్దరు అధికారులను నియమించారు.



**వివరాలు ఇవీ...**

హైదరాబాద్ కమిషనరేట్‌లో శాంతిభద్రతల జాయింట్ కమిషనర్‌గా ఉన్న తఫ్సీర్ ఇక్బాల్ ఇదే కమిషనరేట్ పరిధిలోని సౌత్ రేంజ్ (శంషాబాద్, గోల్కొండ, రాజేంద్రనగర్, చార్మినార్ జోన్లు)కు బదిలీ.

హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో సీసీఎస్ డీసీపీగా పనిచేస్తున్న ఎన్.శ్వేత ఇదే కమిషనరేట్ పరిధిలోని నార్త్ రేంజ్ (జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, సికింద్రాబాద్ జోన్లు)కు బదిలీ. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని స్పెషల్ బ్రాంచి జాయింట్ కమిషనర్‌గా సిద్దిపేట కమిషనర్ విజయ్‌కుమార్ (మిగతా 2వ పేజీలో)



## సంక్రాంతికి 6,431 ప్రత్యేక బస్సులు

హైదరాబాద్, (నవజ్యోతి ప్రతినిధి):

సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లేవారికోసం 6,431 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తెలంగాణరాష్ట్ర రోడ్డురవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) తెలిపింది. ముఖ్యంగా ఈ నెల 9, 10, 12, 13 తేదీల్లో నాలుగురోజుల పాటు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండొచ్చని అంచనా వేశామని, ఆ మేరకు సేవల్ని అందుబాటులో ఉంచనున్నట్లు వివరించింది. అదేవిధంగా తిరుగుప్రయాణంలో 18, 19 తేదీల్లో రద్దీకి తగిన ఏర్పాట్లు చేశామని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొంది. హైదరాబాద్‌లో రద్దీ ప్రాంతాలైన ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ క్రాస్‌రోడ్స్, ఆరాంఘర్, ఎల్బీనగర్ క్రాస్‌రోడ్స్, కేపీహెచ్‌బీ, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి ప్రాంతాల నుంచి బస్సులు బయల్దేరతాయి.

**జీవో నంబరు 16 ప్రకారం టిక్కెట్ల ధరల్ని అదనంగా 50 శాతం వరకు పెంచుకునే అవకాశం ఉంది. ఈ సంక్రాంతి పండగకు నడిపే ప్రత్యేక బస్సుల్లోనూ అదనపు ఛార్జీలు ఉంటాయి. 9, 10, 12, 13 తేదీలతో పాటు 18, 19 తేదీల్లో మాత్రమే పెంచిన ఛార్జీలు అమలవుతాయి.**

రాష్ట్ర ప్రభుత్వ మహాలక్ష్మి పథకంలో భాగంగా సంక్రాంతికి నడిపే పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు రవాణా సదుపాయం యథవిధిగా అమల్లో ఉంటుంది. టీజీఎస్ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్‌ను www.tgsrtcbus.in వెబ్‌సైట్‌లో చేసుకోవాలని ఆర్టీసీ యాజమాన్యం తెలిపింది. ప్రత్యేక బస్సులకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033కు సంప్రదించాలని సూచించింది.

సంక్రాంతి పండగకు ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో రైల్వేశాఖ మరికొన్ని ప్రత్యేక రైళ్లను బుధవారం ప్రకటించింది. హైదరాబాద్ నుంచి సిర్పూర్‌కాగజ్‌నగర్‌కు జనవరి 9, 10 తేదీల్లో రెండు ప్రత్యేక రైళ్లు బయల్దేరుతాయి.

కాగజ్‌నగర్ నుంచి హైదరాబాద్‌కు 9, 18 తేదీల్లో రెండు ప్రత్యేక రైళ్లు అందుబాటులో ఉంటాయి. చర్లపల్లి నుంచి అనకాపల్లికి ఈ నెల 14న ప్రత్యేక రైలు బయల్దేరుతుంది. 15న అనకాపల్లి నుంచి చర్లపల్లికి తిరుగు ప్రయాణం అవుతుంది.

## సంక్రాంతికి సెలబ్రేట్ ది స్కై సంబురాలు

### మంత్రి జూపల్లి కృష్ణారావు

హైదరాబాద్, (నవజ్యోతి ప్రతినిధి):

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ సంక్రాంతి నేపథ్యంలో అంతర్జాతీయ పతంగుల పండగ, స్వీట్ ఫెస్టివల్, హాట్ ఎయిర్ బెలూన్, డ్రోన్ షోలను నిర్వహిస్తున్నట్లు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. పర్యాటక రంగానికి ఆదరణ పెంచేలా 'సెలబ్రేట్ ది స్కై' పేరిట ఈ నెల 13 నుంచి 18 వరకు అట్టహాసంగా సంబురాలు జరుగుతాయని వెల్లడించారు. ఈ మేరకు బుధవారం సచివాలయంలో విలేకరులతో మంత్రి మాట్లాడుతూ... "పర్యాటక రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు రాయితీలు కల్పిస్తున్నాం. పీపీపీ విధానంలో పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. టూరిజం కాన్‌క్లేవ్, గ్లోబల్ సమిట్ ద్వారా రూ.22,324 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు జరిగాయి. వీటి ద్వారా సుమారు 90 వేల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నాం" అని వివరించారు. సమావేశంలో పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ క్రాంతి వల్లూరి, నిథమ్ డైరెక్టర్ వెంకటరమణ, కల్చర్ లాంగ్వేజ్ ఇండియన్ కనెక్షన్స్ (క్లిక్) సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.






# పోలవరం కలను సాకారం చేస్తున్నాం



- వృథా జలాలను సద్వినియోగం చేసుకుందాం.. అభివృద్ధి చెందుదాం
- నదుల అనుసంధానంతో తెలంగాణకూ లబ్ది
- పోలవరం కుడి కాల్వ ద్వారా కొల్లేరు ప్రాంతాలకు నీరు
- ఫిబ్రవరి 15 నాటికి డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తి
- వచ్చే ఏడాది మార్చి నాటికి పోలవరం పూర్తి అయ్యేలా చర్యలు
- 12 నెలల్లో ఆర్ అండ్ ఆర్ పనులు పూర్తి చేసేలా యాక్షన్ ప్లాన్
- రాయలసీమ లిఫ్ట్ పేరుతో రాజకీయం సిగ్గు చేటు
- రాయలసీమ రిజర్వాయర్లన్నింటినీ నీళ్లతో నింపిన చరిత్ర మాది
- అనుమతుల్లేకుండా ఆరంభించారు... అడ్డగోలుగా దోచేశారు
- మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు

**పోలవరం ప్రాజెక్టును ఏదో ప్రాంతానికి పరిమితమైన ప్రాజెక్టుగా చూడకూడదని... ఈ ప్రాజెక్టు తెలుగు జాతికి నెర్వ్ సెంటర్ లాంటిదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. బుధవారం సీఎం చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించారు. పోలవరం ప్రాజెక్టు సైట్ మొత్తం పర్యటించారు.. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న టన్నెళ్లను.. డయాఫ్రం వాల్, ఈసీఆర్ఎఫ్ డ్యాం పనులను పరిశీలించారు. ప్రాజెక్టు సైటులో అధికారులు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ సందర్శించారు. నిర్మాణ పనులు ఎలా జరుగుతున్నాయోననే అంశాన్ని క్షేత్ర స్థాయిలో పర్యటించిన అనంతరం ముఖ్యమంత్రి ఇరిగేషన్ శాఖ అధికారులు, కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు.**

- (నవజ్యోతి ప్రతినిధి) జనవరి 7

ఈ మేరకు అధికారులకు, కాంట్రాక్టు సంస్థకు పోలవరం ప్రాజెక్టు నిర్మాణం విషయంలో వివిధ సూచనలు చేశారు. అనుకున్న సమయానికంటే ముందుగానే పోలవరం నిర్మాణ పనులు పూర్తి చేసి జాతికి అంకితం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం సీఎం చంద్రబాబు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..." వీలైనంత త్వరగా పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తాం. గతంలోనే డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తై ఉంటే.. రూ.440 కోట్లతోనే నిర్మాణం జరిగేది. ప్రాజెక్టు కూడా త్వరితగతిన పూర్తి అయ్యేది. 2019లో ప్రభుత్వం మారాక పోలవరం ప్రాజెక్టుకు చాలా నష్టం జరిగింది. డయాఫ్రం వాల్ దెబ్బతిన్నా కూడా నాటి ప్రభుత్వం దానిని గుర్తించడానికి చాలా సమయం తీసుకుంది. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయడానికి ఆరేడేళ్లు జాప్యం అయింది. జాప్యం కావడం వల్ల ఖర్చులు పెరిగాయి. డయాఫ్రం వాల్ నిర్మాణానికి అదనంగా రూ.1000 కోట్ల భారం పడింది. వచ్చే ఫిబ్రవరి 15 నాటికి డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తి చేస్తాం. పోలవరం మెయిన్ డ్యాం దాదాపు పూర్తి అయింది. ఎంబాంక్‌మెంట్ పనులు ఈ ఏడాది జూన్ నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈసీఆర్ఎఫ్ డ్యాం గ్యాప్-2 పనులను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని ఆదేశించాం. ఇక పోలవరం ప్రాజెక్టులో ప్రధాన పనులను అన్నింటినీ వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకువస్తాం. వినియోగంలోకి తెచ్చే ప్రయత్నం చేస్తాం." అని ముఖ్యమంత్రి చెప్పారు.

### పునరావాస పనులకు యాక్షన్ ప్లాన్..

"పునరావాసం, ఆర్ అండ్ ఆర్ పనులను 12 నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించాం. ఈ మేరకు యాక్షన్ ప్లాన్ పెట్టుకుని... దానికి అనుగుణంగా పనులు చేపడతారు. పునరావాసం కోసం అవసరమైన భూ సేకరణ కూడా త్వరితగతిన చేపట్టాలని సూచించాం. పోలవరం ప్రాజెక్టు కేంద్రంగా అతిపెద్ద ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ ఏర్పాటు చేయబోతున్నాం. పోలవరం కుడి, ఎడమ కాలువలు... టన్నెళ్ల ద్వారా కనెక్టివిటీ పెంచుతాం. ఎడమ కాలువ పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. విశాఖ వరకు పోలవరం నీళ్లను తీసుకెళ్తాం.

**విశాఖ, అనకాపల్లి జిల్లాలను సస్యశ్యామలం చేస్తాం. అలాగే పోలవరం కాలువల ద్వారా పారే గోదావరి జలాలతో దారి పొడుగునా ఉన్న మైనర్ ఇరిగేషన్, చెక్ డ్యాంలను నింపుతూ వెళ్తాం. ఇక పోలవరం కుడి కాల్వ ద్వారా గోదావరి జలాలను కొల్లేరు వరకు తీసుకెళ్లేలా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నాం. ఐదేళ్ల కాలంలో గత ప్రభుత్వం కేవలం 2 శాతం పనులు మాత్రమే పూర్తి చేసింది. 2014-19 మధ్య కాలంలో టీడీపీ ప్రభుత్వం 72 శాతం పనులు పూర్తి చేసింది. పోలవరం ప్రాజెక్టును గత ప్రభుత్వం గోదావరిలో ముంచేసింది... నిద్రలేని రాత్రులు గడిపా. అంతగా పోలవరం ప్రాజెక్టు నా మనస్సుకు దగ్గరగా ఉంది.**

పట్టిసీమ ప్రాజెక్టుపై విమర్శలు చేశారు. పట్టిసీమ లేకుంటే రాయలసీమకు నీళ్లు ఇచ్చే పరిస్థితి ఉండేది కాదు. నాటి ప్రభుత్వంలో పట్టిసీమను ఏడాదిలో పూర్తి చేయగలిగాం. కృష్ణా డెల్టాకు నీరు అందించగలిగాం. గోదావరి నీళ్లను కృష్ణా డెల్టాకు తీసుకువెళ్లాం. అక్కడ నీటిని పొదుపు చేసి సీమకు కృష్ణా జలాలు వెళ్లేలా చేశాం. దీని వల్ల రాయలసీమకు నీటిని తరలించడం సాధ్యమైంది. రాయలసీమలో రిజర్వాయర్లు అన్నింటినీ నింపాం. ఉద్యాన రంగం అభివృద్ధి చెందుతోంది. పోలవరం పూర్తి కావాలి... నదులు అనుసంధానం చేయాలి... కరువు రహితంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలి... ఇది నా కల."అని సీఎం వివరించారు.

### ప్రజా ప్రయోజనాల విషయంలో రాజకీయాలు తగదు

"2014-19 మధ్య కాలంలో ఇరిగేషన్ కోసం రూ. 65 వేల కోట్లు ఖర్చు పెట్టాం... వైసీపీ కేవలం రూ. 12 వేల కోట్లు ఖర్చుపెట్టింది. రాయలసీమలో 2014-19 మధ్య కాలంలో రూ. 12 వేల కోట్లు ఖర్చుపెట్టాం... వాళ్లు కేవలం రూ. 2 వేల కోట్లు ఖర్చు పెట్టారు. ప్రాజెక్టులను నిర్వీర్యం చేస్తున్నారని ప్రతిపక్షంలో ఉండగా నేను పర్యటనలు చేస్తుంటే... నన్ను నాటి ప్రభుత్వం అరెస్ట్ చేసింది. పోలవరం ప్రాజెక్టు ద్వారా రాష్ట్రం నలుమూలలకు నీటిని అందించేలా ప్రణాళిక చేసుకోవచ్చు. సమర్థ నీటి నిర్వహణతో 368 టీఎంసీల నీళ్లు రాయలసీమ రిజర్వాయర్లల్లో ఉన్నాయి... చాలా సంతోషంగా ఉంది. ఒక పంటకు నీళ్లవ్వలేని నెల్లూరు జిల్లాలో రెండు పంటలకు నీరు ఇచ్చే పరిస్థితి వచ్చింది. రెండు రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో రాజకీయాలు చేయడం సరి కాదు. తెలంగాణలో దేవాదుల, కల్వకుర్తి, మాధవరెడ్డి లిఫ్ట్ నేనే స్టార్ట్ చేశాను. కృష్ణా డెల్టా ఆధునీకరణతో 20 టీఎంసీల నీటిని పొదుపు చేసి... బీమా లిఫ్ట్ పూర్తి చేశాం. ఆర్డీఎస్ కు నీళ్లు రాకపోతే... జూరాల నుంచి లింక్ కెనాల్ ద్వారా మహబూబ్ నగర్ జిల్లాలో 40 వేల ఎకరాలకు నీళ్లందించాం. గోదావరి పైనా తెలంగాణలో అలీసాగర్, గుత్ప ప్రాజెక్టులు చేపట్టాం. హైదరాబాద్ నగరానికి సాగర్ జలాలు అందించాం. తెలుగుజాతి కోసం హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేశాం. గోదావరిలో పుష్కలంగా నీళ్లు ఉన్నాయి... దేవాదుల ప్రాజెక్టు విస్తరించుకుంటే ఇబ్బంది లేదు. పోలవరం నీళ్లను మేం వాడుకుంటే అభ్యంతరం వ్యక్తం చేయడం సబబేనా..? పోలవరం నీళ్లను వినియోగించుకుని కృష్ణా జలాలను పొదుపు చేసుకుంటున్నాం. ఈ పొదుపు చేసిన నీటిని సీమకు మళ్లిస్తున్నాం... అన్నీ కలిసి వస్తే... అవసరమైతే తెలంగాణ కూడా నీళ్లు ఇవ్వవచ్చు."అని చంద్రబాబు వెల్లడించారు.

### అబద్దాన్ని వందసార్లు చెబితే నిజమవుతుందా?

"రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టుపై కొందరు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారు. ఓ అబద్దాన్ని వందసార్లు చెబితే నిజం అవుతుందా.? రూ. 3825 కోట్లను రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టుకు మంజూరు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టు పనులను ప్రారంభించారు. సరైన అనుమతులు లేకుండా పనులు ప్రారంభించారని జరిమానా కూడా పడింది. ఆ పనులను ఆపేయాలని ఎన్జీటీ ఆదేశించింది. రూ. 900 కోట్లు కాంట్రాక్టరుకు చెల్లించారు. అనుమతుల్లేని ప్రాజెక్టులు మొదలు పెట్టి రూ. 2500 కోట్లు చెల్లింపులు జరిపారు. విచ్చలవిడిగా, అడ్డగోలుగా పనులు చేశారు. మచ్చుమర్రి ప్రాజెక్టు ద్వారా సీమకు నీటిని తరలించే అవకాశం ఉన్నా... 34 టీఎంసీల నీటిని తరలిస్తామంటూ మరో ప్రాజెక్టు చేపట్టారు. వ్యవస్థలను ట్రాక్ లో పెట్టే చేస్తే బురద జల్లుతున్నారు. హంద్రీ-నీవా ద్వారా అన్ని చెరువులకు నీళు ఇచ్చాం... కుప్పం వరకు నీళ్లు పారించాం. సీమలో ప్రాజెక్టులన్నింటికీ నీళ్లతో నింపాం. ఎప్పుడూ నీళ్లు చేరని బ్రహ్మం సాగర్ రిజర్వాయర్ కూ నీళ్లను పంపించాం. నాపై బురద జల్లితే..వారికే నష్టం. దేశంలో నదుల అనుసంధానం జరగాలనేది నా కోరిక. సముద్రంలోకి వృధాగా పోయే నీళ్లను వాడుకోగలిగితే.. మేలు జరుగుతుంది. తెలంగాణలో వరదలు వస్తే ఏపీని ముంచెత్తుతాయి. సముద్రంలోకి పోయే నీళ్లను వినియోగించుకుంటే ఆటో పైలెట్ విధానంలో అభివృద్ధి జరుగుతుంది. నా రాజకీయ జీవితంలో చాలా ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి.. పూర్తి చేశాను. ఏపీలో 90 శాతం ప్రాజెక్టులు తెలుగుదేశం చేపట్టినవే. కొంత మందికి ప్రాజెక్టులు అర్థం కావు... కానీ రాజకీయం మాత్రం చేస్తారు. తెలుగుజాతి అంతా ఒకటే. ఇచ్చి పుచ్చుకునే ధోరణితో వ్యవహరించాలి."అని ముఖ్యమంత్రి కోరారు. సీఎం చంద్రబాబు పోలవరం పర్యటనలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కొలుసు పార్థసారథి, నాదెండ్ల మనోహర్, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే, ఇతర ప్రజా ప్రతినిధులు, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఏప్రిల్‌లో మరో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ

హైదరాబాద్, (నవజ్యోతి ప్రతినిధి):

రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చే బాధ్యత ప్రభుత్వానిదేనని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇప్పటికే ఒక విడత ఇందిరమ్మ ఇళ్లు కేటాయించామని.. మరో విడత ఏప్రిల్‌లో ఇవ్వనున్నట్లు చెప్పారు. రానున్న రెండు సంవత్సరాల్లో మరో రెండు విడతల్లో ఇళ్లు ఇస్తామన్నారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ సమీపంలో నిర్మాణంలో ఉన్న 2,160 'నమూనా' ఇందిరమ్మ ఇళ్లను నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో పొంగులేటి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదటి విడతగా రూ.22,500 కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందన్నారు. లబ్ధిదారులకు దశల వారీగా ప్రతి సోమవారం బిల్లులు చెల్లిస్తున్నట్లు వివరించారు. గత ప్రభుత్వం గృహజ్యోతి కింద మంజూరు చేసి మధ్యలో వదిలేసిన ఇళ్లనూ పూర్తి చేయాలని ఇతర పార్టీల ఎమ్మెల్యేలు కోరుతున్నారని, దీనిపై ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకుంటుందని వివరించారు. భారాస సర్కారు కాళేశ్వరం పేరుతో రూ.లక్ష కోట్లు కొల్లగొట్టడం వల్ల ఏర్పడిన ఆర్థిక ఇబ్బందులను ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ ప్రస్తుత ప్రభుత్వం సమర్థంగా పనిచేస్తోందన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం పంపిణీ లాంటి కార్యక్రమాలతో పేదలు సంతోషంగా ఉన్నారన్నారు. గత ప్రభుత్వం గృహ నిర్మాణ శాఖను రద్దు చేసి పేదలకు ఇంటి భరోసా లేకుండా చేస్తే.. మంత్రి పొంగులేటి అత్యంత సమర్థంగా ఆ శాఖను నడుపుతూ పేదలకు ఇళ్లు కట్టిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలోనే అతి పెద్దదైన హుజూర్‌నగర్ ఇందిరమ్మ కాలనీ ఇళ్ల పనులను మార్చి 31 నాటికి పూర్తి చేస్తామని ప్రకటించారు. వెంటనే లబ్ధిదారుల ఎంపికను ప్రారంభించాలని మంత్రులు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ కార్యదర్శి గౌతమ్, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ నరసింహ పాల్గొన్నారు.

## భూ మాతను రక్షించుకుంటూ రైతుల ఆదాయం పెంచాలి



- అటవీ, ఉద్యాన శాఖ ఉన్నతాధికారుల సమీక్షలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

అమరావతి, జనవరి 7 (నవజ్యోతి ప్రతినిధి):

భూ మాతను రక్షించుకుంటూ, రైతుల ఆదాయం పెంచే విధంగా ప్రణాళికలకు రూపకల్పన చేయాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. పండ్ల తోటల్లో విభిన్న జాతుల మొక్కలు సాగు చేయడం ద్వారా భూసారాన్ని పెంచడంతో పాటు వాతావరణాన్ని రక్షించుకోవచ్చని తెలిపారు. బుధవారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో 50 శాతం గ్రీన్ కవర్ ప్రణాళికలపై అటవీ, ఉద్యాన శాఖల ఉన్నతాధికారులతో చర్చించారు. గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, 50 శాతం గ్రీన్ కవర్ అంశాలపై టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చర్యల్లో భాగంగా ఈ సమావేశం జరిగింది. గ్రీన్ కవర్ పెంపులో ఉద్యాన శాఖ పాత్ర, పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్యం తదితర అంశాలపై ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, 2047 నాటికి రాష్ట్రంలో 50 శాతం గ్రీన్ కవర్ సాధన అంశాలను కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.

## ప్రఖ్యాత ప్లాస్టిక్ సర్జన్.. డీఎల్ఎన్ ప్రసాద్ కన్నుమూత

హైదరాబాద్, (నవజ్యోతి ప్రతినిధి):

దక్షిణ భారతదేశంలో ప్రఖ్యాత ప్లాస్టిక్ శస్త్రచికిత్స నిపుణులుగా పేరొందిన డాక్టర్ దొడ్డపనేని లక్ష్మ నారాయణ ప్రసాద్(96) బుధవారం కన్నుమూశారు. కొంతకాలంగా వయోభారంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. డీఎల్ఎన్ ప్రసాద్‌గా సుపరిచితులైన ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో విశేష వైద్యసేవలు అందించారు. శుక్రవారం ఉదయం మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. డీఎల్ఎన్ ప్రసాద్ 1930 డిసెంబరు 8న గుంటూరు జిల్లా తెనాలిలో వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. చెన్నైలోని ఆద్యార్ బెసంట్ థియోసాఫికల్ హయ్యర్ సెకండరీ స్కూల్‌లో ఎస్ఎస్ఎల్‌సీ పూర్తిచేశారు. జీవశాస్త్రంపై ఆసక్తి ఉన్నప్పటికీ కుటుంబ పరిస్థితుల దృష్ట్యా 1952లో చెన్నైలోని పాచయ్యప్పాస్ కాలేజీలో బీఏ(గణితశాస్త్రం)లో చేరారు. తర్వాత కుటుంబసభ్యులను ఒప్పించి రామకృష్ణ మిషన్ వివేకానంద కళాశాలలో 1955లో బీఎస్సీ బయాలజీ పూర్తిచేశారు. అదే ఏడాది మాజీమంత్రి ఆలపాటి వెంకట్రామయ్య కుమార్తె ఇందిరను వివాహమాడారు. అనంతరం విశాఖపట్టణంలోని ఆంధ్రా మెడికల్ కాలేజీలో 1961లో ఎంబీబీఎస్, 1964లో ఎం.ఎస్.జనరల్ సర్జరీ పూర్తి చేశారు. హైదరాబాద్‌లోని గాంధీ మెడికల్ కళాశాలలో చేరి, 1969 వరకు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. తర్వాత దిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో ఎంసీహెచ్ ప్లాస్టిక్ సర్జరీలో చేరి డాక్టర్ జె.ఎల్.గుప్తా పర్యవేక్షణలో పనిచేశారు.



### ఉమ్మడి రాష్ట్రంలో తొలి ప్లాస్టిక్ సర్జరీ విభాగం

తర్వాత కొంతకాలానికి హైదరాబాద్‌కు వచ్చిన ప్రసాద్... ఉస్మానియా మెడికల్ కళాశాల, ఆసుపత్రిలో ఉమ్మడి రాష్ట్రంలోనే తొలి ప్లాస్టిక్ సర్జరీ విభాగం ఏర్పాటుకు సన్నాహాలు చేశారు. ఎన్నో సంక్లిష్టతలను అధిగమించి 1972కల్లా ఆ విభాగానికి ఒకరూపు తీసుకొచ్చారు. గుంటూరు, కర్నూలు మెడికల్ కళాశాలలు, ఆసుపత్రుల్లో ప్లాస్టిక్ సర్జరీ విభాగాలను ఏర్పాటు చేయడంలో కీలకపాత్ర పోషించారు. గ్రహణం మొర్రి, చీలిన అంగిలి, కాలిన గాయాలకు అరుదైన ప్లాస్టిక్ సర్జరీలు నిర్వహించారు. ఎంతోమంది పేద రోగులకు కొత్త జీవితాలను ప్రసాదించారు. మరో వైద్యుడు రాఘవరెడ్డితో కలిసి ఉస్మానియాలో ప్లాస్టిక్ సర్జరీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సు ప్రారంభించడానికి విశేష కృషిచేశారు. ఫలితంగా 1986లో ఎంసీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ అందుబాటులోకి వచ్చింది. వేలమంది కోర్సు పూర్తిచేసి దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారంటే అది ప్రసాద్ చలవే. 1993లో ఉస్మానియాలో ప్లాస్టిక్ సర్జరీ ప్రొఫెసర్‌గా పదవీ విరమణ పొందారు. డీఎల్ఎన్ ప్రసాద్ సతీమణి ఇందిర తెనాలి ఎమ్మెల్యేగా, గుంటూరు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌గానూ పనిచేశారు. ఆమె ఇప్పటికే కాలం చేశారు. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. గైనకాలజిస్ట్ అయిన పెద్ద కుమార్తె గోగినేని ఉమ.. గతంలో తెనాలి నుంచి ఎమ్మెల్యేగా వ్యవహరించారు. చిన్న కుమార్తె ఆలపాటి ఉష హైదరాబాద్‌లో స్థిరపడ్డారు.

### ఎన్టీఆర్‌కు శస్త్రచికిత్స చేసి..

ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనపై ఓ ఆగంతకుడు కత్తితో దాడి చేశాడు. దీంతో ఆయన చేతివేలు చీరుకుపోయి గాయమైంది. ఆ వేలుకు ప్రసాద్ ప్లాస్టిక్ సర్జరీ చేశారు. సతీమణి ఇందిర చనిపోయాక ప్రత్యక్ష రాజకీయాల్లోకి వెళ్లేందుకు ఉద్యోగానికి రాజీనామా చేయగా.. మీ వైద్య సేవలు ప్రజలకు ఎంతో అవసరమని ఎన్టీఆర్, దగ్గుబాటి వెంకటేశ్వరరావు ఆయనను వారించారు.

## భారీగా ఐపీఎస్ అధికారుల బదిలీ

(మొదటి పేజీ తరువాయి)

సైబరాబాద్ కమిషనరేట్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీగా మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి పాత రాచకొండ (ప్రస్తుతం మల్కాజిగిరి) కమిషనరేట్ పరిధిలోని మహేశ్వరం డీసీపీ నారాయణరెడ్డి... కొత్తగా ఏర్పాటు చేసిన ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని మహేశ్వరం జోన్ డీసీపీగా బదిలీ. సికింద్రాబాద్ డీసీపీగా హైదరాబాద్ 'కార్' హెడ్‌క్వార్టర్స్ డీసీపీ రక్షిత మూర్తి. మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని ఉప్పల్ డీసీపీగా బాలానగర్ డీసీపీ .సురేష్‌కుమార్. హైదరాబాద్ దక్షిణ మండలం డీసీగ్మా ఉన్న ఖరే కిరణ్ ప్రభాకర్... చార్మినార్ జోన్ డీసీపీగా బదిలీ. పాత రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఎల్బీనగర్ జోన్ డీసీపీ అనూరాధ కొత్తగా ఏర్పాటు చేసిన మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని ఎల్బీనగర్ డీసీపీగా బదిలీ. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని రాజేంద్రనగర్ డీసీపీ యోగేష్ యాదవ్ ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని చేవెళ్ల జోన్ డీసీపీగా బదిలీ. కొత్తగా ఏర్పాటు చేసిన కూకట్‌పల్లి జోన్ డీసీపీగా మాదాపూర్ డీసీపీ రితిరాజ్. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని శేరిలింగంపల్లి డీసీపీగా హైదరాబాద్ పశ్చిమ మండలం డీసీపీ సీహెచ్.శ్రీనివాస్. సిద్దిపేట కమిషనర్‌గా హైదరాబాద్ ఉత్తరమండలం డీసీపీ సాధన రశ్మి పెరుమాళ్. మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని మల్కాజిగిరి జోన్ డీసీపీగా పూర్వపు రాచకొండ కమిషనరేట్ పరిధిలోని మల్కాజిగిరి జోన్ డీసీపీ సీహెచ్.శ్రీధర్. కొత్తగా ఏర్పాటు చేసిన ఖైరతాబాద్ జోన్ డీసీపీగా హైదరాబాద్ మధ్యమండలం డీసీపీ శిల్పవల్లి. రాజేంద్రనగర్ జోన్ డీసీపీగా ట్రాన్స్‌కో ఎస్పీ ఎస్.శ్రీనివాస్. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని సౌత్‌వెస్ట్ డీసీపీ జి.చంద్రమోహన్ కొత్తగా ఏర్పాటు చేసిన గోల్కొండ డీసీపీగా బదిలీ. పూర్వపు రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఎస్వోటీ డీసీపీ ఎ.రమణారెడ్డి జూబ్లీహిల్స్ డీసీపీగా బదిలీ. ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని షాద్‌నగర్ జోన్ డీసీపీగా నిఘా విభాగం ఎస్పీ సీహెచ్.శిరీష. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని శంషాబాద్ జోన్‌ను హైదరాబాద్‌లో విలీనం చేయగా అక్కడ ఉన్న డీసీపీ బి.రాజేష్‌ను అదే జోన్‌లో కొనసాగించారు.

## భూములను కాజేసేందుకు రేవంత్ ప్రభుత్వం కుట్రలు

### కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, (నవజ్యోతి ప్రతినిధి):



బడ్జెట్ కేటాయింపులు లేకుండా విద్యావ్యవస్థను ధ్వంసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా యూనివర్సిటీల భూములను కాజేయడంపై మిషన్ మోడ్లలో పనిచేస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం ఎక్స్‌వేదికగా స్పందిస్తూ.. ఇటీవల హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను ప్రైవేటు పరం చేసేందుకు అటవీ సంపదను, జీవవైవిధ్యాన్ని లెక్కచేయకుండా ఆ భూమిని చదును చేసేందుకు ప్రయత్నించిందన్నారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని మొట్టికాయలు వేస్తే వెనక్కు తగ్గిందని పేర్కొన్నారు. తాజాగా గచ్చిబౌలిలోని ప్రఖ్యాత మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ భూములపై కన్నేసిందన్నారు. యూనివర్సిటీలోని 50 ఎకరాలను వెనక్కు తీసుకుని మళ్లీ ప్రైవేటుకు కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేసిందన్నారు. యూనివర్సిటీల వద్ద భూమి ఉంటే భవిష్యత్ అవసరాలకోసం, విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు ఉపయోగపడుతుందని, ప్రభుత్వ ఖజానాను నింపేందుకు వాడుకోవాల్సిన అవసరం లేదన్నారు. ల్యాండ్ బ్యాంక్ పెంచుకోవడం యూనివర్సిటీ భూములను ఆర్థిక దోపిడీకి వాడుకోవడంపైనే రేవంత్ రెడ్డి సర్కారు ఆసక్తి చూపిస్తోంది. రాష్ట్రంలో విద్యావ్యవస్థ, వర్సిటీల పురోగతిని మాత్రం అంధకారంలోకి నెట్టేస్తోందని మండిపడ్డారు.

## లైసెన్స్‌లు రద్దు చేస్తాం.. ఆహార పదార్థాల కల్తీపై సీపీ సజ్జనార్ వార్నింగ్

హైదరాబాద్, (నవజ్యోతి ప్రతినిధి):

ఆహార పదార్థాల కల్తీపై హైదరాబాద్ సీపీ సజ్జనార్ సీరియస్ అయ్యారు. ఫుడ్ కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కల్తీని నిరోధించడానికి పోలీస్, ఫుడ్ సేఫ్టీ అధికారులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి ఎస్వోపీ అమలు చేస్తామని వెల్లడించారు. పదే పదే కల్తీలకు పాల్పడితే లైసెన్సులు సైతం రద్దు చేస్తామని చెప్పారు. అవసరమైతే పీడి యాక్ట్ కూడా ప్రయోగిస్తామని కల్తీ రాయుళ్లను హెచ్చరించారు. ఇదిలా ఉంటే రోజురోజుకు ఆహార పదార్థాల కల్తీ పెరుగుతోంది.ప్రతి ఆహార పదార్థాన్ని కల్తీ చేస్తూ మార్కెట్ లో యథేచ్ఛగా అమ్మేస్తున్నారు. చిన్నారులు తాగే పాలను సైతం కల్తీ చేస్తున్న ఘటనలు రాష్ట్రంలో చోటు చేసుకున్నాయి. పాలలో యూరియా లాంటి ప్రమాదకర రసాయనాలు కలిపి కల్తీ చేయడం ఆందోళన కలిస్తోంది. మరోవైపు అల్లంలో అరటితో తొక్కతో పాటు ఇతర రసాయనాలు, మసాలాల్లో చెక్కపొట్టు, కారంపొడిలో ఇటుకపొడి ఇతర రసాయనాలు కలిపి కల్తీ చేస్తున్న ఘటనలు వెలుగు చూశాయి. జంతువుల కలేభరాళతో వంట నూనెలు తయారు చేస్తున్న ఘటనలు సైతం హైదరాబాద్ లో చోటు చేసుకున్నాయి.

# నల్గొండ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన బి.చంద్రశేఖర్‌కు వీడ్కోలు సన్మానం




**బదిలీపై వెళ్లిన అధికారులను ఘనంగా సత్కరించిన జిల్లా యంత్రాంగం**

సంగారెడ్డి, జనవరి 7 (నవజ్యోతి దినపత్రిక):

సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్‌గా ప్రజాహిత సేవలందించిన బి. చంద్రశేఖర్ నల్గొండ జిల్లా కలెక్టర్‌గా పదోన్నతిపై బదిలీ కావడంతో జిల్లా యంత్రాంగం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన జిల్లా యువజన క్రీడల అధికారి ఖాసీం బేగ్, అటవీ శాఖ అధికారి శ్రీధర్ రావులను కూడా సన్మానించి వారి సేవలను కొనియాడారు. జిల్లా అభివృద్ధి, పాలనలో వీరందరి పాత్ర ప్రశంసనీయమని అధికారులు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, చంద్రశేఖర్ గత రెండున్నర సంవత్సరాలుగా జిల్లా అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ అనేక కీలక కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేశారని తెలిపారు. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికలను శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించడంలో ఆయన నాయకత్వం కీలకమైందని అన్నారు. డీవైఎస్ఓ ఖాసీం బేగ్, అటవీ శాఖ అధికారి శ్రీధర్ రావుల సేవలను కూడా ప్రశంసించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ, సంగారెడ్డి జిల్లాతో తనకు గాఢమైన అనుబంధం ఏర్పడిందని, అధికారుల సహకారం వల్ల ప్రజలకు మెరుగైన సేవలు అందించగలిగానని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పాండు, మాధురి, సబ్ కలెక్టర్ ఉమా హారతి, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రముఖులకు శ్రీ అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఆలయంకు రమ్మని ఆహ్వానం

దెందులూరు జనవరి 7 (నవజ్యోతి దినపత్రిక) :

గాలాయ గూడెం శ్రీ అచ్చమ్మ పేరంటాలు తల్లి 69 వ వార్షికోత్సవములు సందర్భముగా ఈ నెల 24 నుండి ఫిబ్రవరి 1వ తేదీ వరకు జరుగుతాయి అని ఆలయ కమిటీ సభ్యులు అందరూ కలిసి తెలియ పరుస్తూ ఏలూరు పార్లమెంటు సభ్యులు పుట్టా మహేష్ కుమార్ యాదవ్ తో పాటు ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య(చంటి) ని ఏ పి ఎస్ ఆర్ టీ సి విజయవాడ జోనల్ చైర్మన్ ఏలూరు జనసేన పార్టీ ఇన్చార్జి రెడ్డప్పల నాయుడు ని రాష్ట్ర వడ్డీల సంక్షమ అభివృద్ధి సంఘం చైర్మన్ దెందులూరు నియోజకవర్గ జనసేన పార్టీ నాయకురాలు ఘంటసాల వెంకటలక్ష్మ ని ఏలూరు నియోజకవర్గం జనసేన పార్టీ సీనియర్ నాయకులు శ్రీకృష్ణ సుజుకి షోరూం చైర్మన్ నారా శేషుని ఏలూరు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నాయుడు సోముని మరియు మరికొంత మంది ప్రముఖులను ప్రతి సంవత్సరం అమ్మవారికి తమ వంతు సాయం చేసే భక్తులను గౌరవప్రదముగా కలిసి ఉత్సవములకు ఆహ్వానించడం జరిగినది.



# తిరుమల తిరుపతి దేవస్థానం డైరీలను అందచేత

దెందులూరు, జనవరి 7 (నవజ్యోతి దినపత్రిక)

దెందులూరు నియోజకవర్గం, దెందులూరు మండలం, గాలాయగూడెంలో ప్రతీ ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే శ్రీ అచ్చమ్మ పేరంటాలు తల్లి తిరనాళ్ళ ఆహ్వాన పత్రికను దెందులూరు నియోజకవర్గ జనసేన నాయకులు కొఠారు ఆదిశేషు, కొఠారు లక్ష్మ లకు అందించి ఆహ్వానించిన ఆలయ కమిటీ సభ్యులు. ఈ నేపథ్యంలో జనసేన పార్టీ దెందులూరు నియోజకవర్గం ఇంచార్జి కొఠారు అదిశేషు, లక్ష్మ నాయకులు నూతన సంవత్సర, పండుగలు శుభాకాంక్షలు తెలిపిన కమిటీ సభ్యులు అందరికీ తిరుమల తిరుపతి దేవస్థానం డైరీలను అందచేసారు. ఈ కార్యక్రమం లో జనసేన నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# గడ్డి మందు వాడకంపై అవగాహన కల్పించిన డాక్టర్ మహేష్ రెడ్డి

మల్యాల, జనవరి 07 (నవజ్యోతి దిన పత్రిక):

మల్యాల మండలం ముత్యంపేట గ్రామంలో రైతులకు ప్యారాకట్ గడ్డి మందు వాడకంపై అవగాహన కల్పించేందుకు డాక్టర్ మహేశ్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సు, హెల్త్ క్యాంప్ నిర్వహించబడింది. డాక్టర్ మహేష్ రెడ్డి మాట్లాడుతూ, రైతుల ఆరోగ్యం, భూసారం కాపాడాలంటే అత్యంత ప్రమాదకరమైన గడ్డి మందుల వినియోగం తగ్గించి ప్రత్యామ్నాయ పద్ధతులు అవలంబించడం అనివార్యం అని సూచించారు. అలాగే, ప్రతి గ్రామంలో ఇలాంటి అవగాహన సదస్సులు నిర్వహించి ప్యారాకట్ వంటి మందుల ప్రమాదాల గురించి రైతులకు సరైన సమాచారం చేరేలా చూడాలని అధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు. ప్యారాకట్ గడ్డి మందు వాడకంతో రైతుల ఆరోగ్యంపై కలిగే ప్రమాదాలు, చర్మం, కళ్ళు, శ్వాసకోశంపై వచ్చే దుష్ప్రభావాలను వివరించారు. భూసారం తగ్గడం, నేల సూక్ష్మజీవుల నాశనం, నీటి కాలుష్యం వంటి పర్యావరణ సమస్యల గురించి ఉదాహరణలతో వివరించారు. ప్యారాకట్‌కు ప్రత్యామ్నాయంగా సురక్షత గడ్డి మందులు, యాంత్రిక కలుపు నియంత్రణ, సేంద్రీయ పద్ధతుల వినియోగం గురించి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా డిఎస్పి రఘు చందర్, మల్యాల సిఐ రవి, ఎస్ఐ నరేష్, జగిత్యాల అగ్రికల్చర్ ఆఫీసర్ భాస్కర్, గ్రామ సర్పంచ్ దారం ఆదిరెడ్డి. ఉప సర్పంచ్ కందరి ముత్యం రెడ్డి, వార్డు సభ్యులు ముత్యంపేట గ్రామ విడిసి అధ్యక్షులు సామ మైపాల్ రెడ్డి, ముత్యంపేట మాజీ సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, మ్యాక లక్ష్మణ్, నల్ల నరసింహారెడ్డి, గ్రామంలోని యువకులు, మల్యాల మండల వ్యవసాయ అధికారి చంద్ర దీపక్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు. అనంతరం మెడికల్ క్యాంపు లో ప్రజలు పాల్గొన్నారు.




# రోడ్డు పనుల ఆలస్యం.. వస్తున్నా దుమ్ము.. తడుపుతున్న జన సైనికులు

దెందులూరు, జనవరి 7 (నవజ్యోతి దినపత్రిక)



పెదపాడు మండలం, ఏపూరు గ్రామంలోని శ్రీ మద్దిరావమ్మ తల్లి గుడి నుండి ఫ్లైఓవర్ వరకూ చేపట్టిన రోడ్డు పనులు ఆలస్యం అవ్వడంతో అసంపూర్తిగా ఉన్న గ్రామస్తులకు రోడ్డు నుండి వస్తున్న దుమ్ము స్థానికంగా నివాసముంటున్న జనాలకు, బాటసారులకు ఇబ్బంది కలిగిస్తుందని తెలుసుకుని జనసేన పార్టీ దెందులూరు నియోజకవర్గం ఇంచార్జి కొఠారు ఆదిశేషు, లక్ష్మ వెంటనే స్పందించి అందుబాటులో ఉన్న దెందులూరు జనసేన పార్టీ వాటర్ ట్యాంకర్ తో ఆ రోడ్డును రోడ్డు పనులు అవ్వక పోవడం వల్ల విపరీతమైన దుమ్ము దూళి లేవడం ద్వారా అరికట్టెందుకు నా నియోజకవర్గం ప్రజలు సౌకర్యార్థం గత వారం రోజులుగా క్రమం తప్పకుండా తడుపుతూ, ప్రజలకు ఉన్న అసౌకర్యం నుండి ఉపసమనం కలిగిస్తున్నమని తెలిపారు. క్రమం తప్పకుండ ఏపూరు జనసేన నాయకులు, జనసైనికులు రోడ్డు ను తడుపుతున్నారు.

# ఆల్ ఇండియా గీత కార్మికుల సంక్షమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గా నూతి రవీందర్ గౌడ్

దెందులూరు, జనవరి 7 (నవజ్యోతి దినపత్రిక):




జై గౌడ్ సేన నాయకుడిగా, దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గ ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన చల్ల చింతలపూడి గ్రామానికి చెందిన జై గౌడ్ సేన రాష్ట్ర నాయకులు, ఆల్ ఇండియా గీత కార్మిక సంక్షమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నూతి రవీందర్ గౌడ్ ను ఎంపిక చేయడం జరిగిందని ఆల్ ఇండియా గీత కార్మికుల సంక్షమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఈడిగా నరేంద్ర అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు నూతి రవీందర్ గౌడ్ ను పలువురు ఘనంగా సన్మానించారు. గౌడ్ రగ్గులు అందజేశారు. ఆల్ ఇండియా గీత కార్మికుల సంక్షమ సంఘం కమిటీ సభ్యులు బొప్పన పూర్ణచంద్రరావు, ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం ఏలూరు టౌన్ అధ్యక్షులు కాకర్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ గంగానమ్మ అమ్మవారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలి



- **దక్షణపు వీధి గంగానమ్మ మహోత్సవం సందర్భంగా అమ్మవారికి సారే సమర్పణ..**
- **మేడల వద్ద అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన రెడ్డి అప్పల నాయుడు**

దెందులూరు, జనవరి 07 (నవజ్యోతి దినపత్రిక) :

శతాబ్ద కాలంగా హేలాపురి ప్రజలకు ఆధ్యాత్మిక ఆనందాన్ని ఇచ్చిన శ్రీ గంగానమ్మ అమ్మవారి మహోత్సవం దక్షణపు వీధిలో ఘనంగా జరుగుతున్నాయిఅబశ్రీశ్రీ. ఈ సందర్భంలో బుధవారం జాతర కమిటీ వారి ఆహ్వానం మేరకు దక్షణపు వీధి సర్వజన సమ్మేళన జాతర అమ్మవార్లను ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ భక్తిశ్రద్ధలతో దర్శించుకుని, సారి సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర కమిటీ అధ్యక్షులు అద్దెపల్లి శ్రీనివాస్ ఆయనకు గౌరవంగా స్వాగతం పలికారు. అనంతరం మేడల వద్దకు చేరుకొని కొలువుదీరిన అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పల నాయుడు మాట్లాడుతూ శ్రీ గంగానమ్మ అమ్మవారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరికీ ఉండాలని ఆకాంక్షించారు. ఏడు సంవత్సరాలకు ఒకసారి జరుపుకునే, 150 సంవత్సరాలు చరిత్ర కలిగిన దక్షణపు వీధి గంగానమ్మ అమ్మవారి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను రెడ్డి అప్పలనాయుడు ప్రత్యేకంగా అభినందించారు. ఈనెల 26వ తేదీన శ్రీ గంగానమ్మ అమ్మవారిని అంగరంగ వైభవంగా, మేళతాళములతో, డప్పు వాయిద్యములతో, చిత్రవిచిత్ర వేషధారణలతో, భక్తి శ్రద్ధలతో ఊరేగింపు కొనసాగుతుందన్నారు. ఈ ఊరేగింపులో ఏలూరు నియోజకవర్గ ప్రజలు, బంధుమిత్రులు, భక్తులు ప్రతి ఒక్కరు పాల్గొని ఆ అమ్మవారిని దర్శించుకోవాలని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారుఅబశ్రీశ్రీ. ఈ కార్యక్రమంలో జాతర ఉత్సవ కమిటీ సభ్యులు నగిరెడ్డి కాశీ నరేష్, కరణం గణేష్, పండు నాయుడు, గల్లా రామకృష్ణ, జనసేన నగర అధ్యక్షులు వీరంకి పండు, నాయకులు రెడ్డి గౌరీ శంకర్, సరిది రాజేష్, కూని శెట్టి మురళి కృష్ణ, బోండా రాము నాయుడు, బెజవాడ నాగభూషణం కుమార్, ఎట్రించి ధర్మేంద్ర, జనసేన రవి, కొండల ప్రసాద్, వీర మహిళలు తుమ్మపాల ఉమా దుర్గ, దుర్గా బీబీ తదితరులు పాల్గొన్నారు.

# మాదిగ సంక్షమ పరిషత్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడుగా ఎనుముల జయన్న మాదిగ నియామకం

విజయవాడ, జనవరి 7 (నవజ్యోతి దినపత్రిక) :

మాదిగ సంక్షమ పరిషత్ (RGD NO:273/2024) జాతీయ, రాష్ట్ర స్థాయి నూతన కమిటీల నియామకంలో భాగంగా మహబూబ్ నగర్ జిల్లా, కేటీఆర్ నగర్, వీరన్నపేటకు చెందిన సీనియర్ నాయకులు ఎనుముల జయన్న మాదిగ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఎనుముల జయన్న మాదిగ మాట్లాడుతూ "మాదిగ సంక్షమ పరిషతు జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు తెన్నేటి సురేష్ మాదిగ నాయకత్వంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్‌ల ఆశయాలకు, సంఘ విధి విధానాలకు అనుగుణంగా మాదిగల సమగ్ర అభివృద్ధి కోసం, మాదిగ గ్రామాలలోని సమస్యల కోసం నా వంతుగా కష్టపడి పని చేస్తానని తెలిపారు. నన్ను ఎన్నిక చేసిన జాతీయ అధ్యక్షులు దరూరు నరేష్ మాదిగకి, జాతీయ మహిళా అధ్యక్షురాలు నూతంకి కృష్ణ రేఖ మాదిగ కి నా కృతజ్ఞతలు అని అన్నారు.






# శక్తి నిల్వపై విస్తృత శోధన

**గీతం ఆతిథ్య ఉపన్యాసంలో వెల్లడించిన ఏఆర్ సీఐ శాస్త్రవేత్త డాక్టర్ బులుసు శారద**

పటాన్చెరు, జనవరి 7 (నవ జ్యోతి దినపత్రిక) :

శక్తి నిల్వ పదార్థాలు, పరికరాలపై అధునాతన పరిశోధనలు కొనసాగుతున్నాయని, ఇది క్రమంగా బ్యాటరీలు, సూపర్–కెపాసిటర్లలో ఆవిష్కరణలకు దారితీస్తాయని భారత ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక విభాగంలోని స్వయం ప్రతిపత్తి కలిగిన– పౌడర్ మెటలర్జీ నూతన పదార్థాల కోసం అంతర్జాతీయ అధునాతన పరిశోధనా కేంద్రం (ఏఆర్ సీఐ) శాస్త్రవేత్త డాక్టర్ బులుసు వి.శారద తెలియజేశారు. అధునాతన పదార్థాలు, బ్యాటరీల కేంద్రం (సీఏఎంబీ) విభాగాధిపతి అయిన ఆమె గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లో 'బ్యాటరీలపై అధునాతన పరిశోధనలు, ఆవిష్కరణలు' అనే అంశంపై బుధవారం ఆతిథ్య ఉపన్యాసం చేశారు.

'సైద్ధాంతిక పరిశోధనను సాంకేతికతగా మార్చడం, దానిని భారతీయ పరిశ్రమలకు బదిలీ చేయడం' కార్యక్రమం కింద నిర్వహించిన ఈ ఉపన్యాసంలో, లిథియం–అయాన్, సోడియం–అయాన్, లిథియం–సల్ఫర్ బ్యాటరీలు, సూపర్–కెపాసిటర్లలోని వర్తమాన పురోగతుల గురించి డాక్టర్ శారద వివరించారు. నానో–నిర్మిత పదార్థాలు, అధునాతన తయారీ పద్ధతులతో పాటు, శక్తి సాంద్రత, భద్రత, సైక్లింగ్ స్థిరత్వం, అయాన్ రవాణా, తక్కువ ఖర్చులోని కీలక సవాళ్లు, ఆవిష్కరణల గురించి ఆమె చర్చించారు.

అత్యంత ఖర్చుతో కూడుకున్నదైన కోబాల్ట్ రహిత కాథోడ్లు, సోడియం–అయాన్ బ్యాటరీలు, లిథియం–సల్ఫర్ వ్యవస్థలు, పౌచ్ సెల్ తయారీ వంటి బ్యాటరీ పదార్థాలలో ఏఆర్ సీఐలో కొనసాగుతున్న దేశీయ పరిశోధన కార్యక్రమాలను డాక్టర్ శారద వివరించారు. వాటి పారిశ్రామిక ఔచిత్యాన్ని, సాంకేతిక సంసిద్ధత స్థాయిలను నొక్కి చెప్పారు. ముఖ్యంగా ఈ ఉపన్యాసం, అధ్యాపకులకు స్థిరమైన శక్తి నిల్వ సాంకేతికతలపై విలువైన అంతర్దృష్టులను అందించింది.

భౌతిక శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ టి.విశ్వంతో కలిసి గీతం విశిష్ట ఆచార్యుడు ప్రొఫెసర్ బీ.వీ.ఆర్. టాటా గౌరవ అతిథిని సత్కరించారు. ఈ ఆతిథ్య ఉపన్యాస కార్యక్రమాన్ని అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పీ.ఎం. స్వరూప్ రాజు సమన్వయం చేశారు. పలువురు భౌతిక, రసాయన, గణిత శాస్త్ర అధ్యాపకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 2 నుంచి 21 వరకు ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు

మేడ్చల్ బ్యూరో, జనవరి 07, (నవజ్యోతి దినపత్రిక) :







ఫిబ్రవరి 25 నుండి ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు, ఫిబ్రవరి 2వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ప్రాక్టికల్స్ నిర్వహణ, పరీక్షలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకోవాలి. జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల్లో మొత్తం 1,35,198 విద్యార్థులు పరీక్షలు వ్రాయనున్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా అన్ని రకాల వసతులు సమకూర్చి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఈ విషయంలో ఇప్పటి నుంచే పరీక్ష కేంద్రాలకు సంబంధించి అధికారులు క్షత్రస్థాయిలో పర్యటించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి, అన్నారు. ఫిబ్రవరి 25 వ తేదీ నుంచి మార్చి 18వ తేదీ వరకు జరగనున్న పరీక్షల నేపథ్యంలో ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి జిల్లాసంబంధిత శాఖల అధికారులు, సిబ్బందితో ముందస్తు ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. బుధవారం అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి తన ఛాంబర్ లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ... ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు థియరీ, ఎథిక్స్, ఎన్విరాన్మెంటల్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఫిబ్రవరి 25వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. అలాగే ప్రాక్టికల్స్ పరీక్షలు ఫిబ్రవరి 2వ తేదీ నుంచి 21వ తేదీ వరకు రెండు సెషన్లలో మూడు స్పెల్స్ జరుగుతాయని దీనికి గాను జిల్లా వ్యాప్తంగా జనరల్, ప్రాక్టికల్స్, ఒకేషనల్ కోర్సులకు పరీక్షలు ఉంటాయని అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి వివరించారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు గాను జిల్లాలో ప్రథమ సంవత్సరంలో జనరల్ విభాగానికి సంబంధించి 64780 మంది విద్యార్థులు, ఒకేషనల్ కోర్సులో 1368 మంది. మొత్తం 66148 మంది పరీక్షలు రాస్తారని... అలాగే ద్వితీయ సంవత్సరంలో జనరల్లో 67792 మంది విద్యార్థులు, ఒకేషనల్ కోర్సులో 1258 మొత్తం 69050 మంది పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల్లో జనరల్ విభాగానికి సంబంధించి మొత్తం 1,32,572 మంది విద్యార్థులు, ఒకేషనల్ కోర్సులో మొత్తం 2626 మంది మొత్తంగా 1,35,198 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియోట్ పరీక్షలకు గాను 151 పరీక్ష కేంద్రాలు ఉన్నాయన్నారు. పరీక్షలు నిర్వహించే సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను, పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని, అవసరమైన పోలీసు బందోబస్త్ ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖను, పరీక్ష కేంద్రాల నుండి జవాబు పత్రాలను పగడ్బందీగా తీసుకువెళ్లేందుకు పోస్టల్ శాఖ సహకరించాలని, ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. దీనికి సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాల్సిందిగా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఎం.కిషన్, కళాశాలల ప్రిన్సిపల్స్, సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం

ఖమ్మం, జనవరి 7 (నవజ్యోతి దినపత్రిక):

ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ జాగృతి దివస్ సందర్భంగా మ్యాక్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ నరేష్ మాట్లాడుతూ, పార్ట్టైమ్ ఉద్యోగాల పేరుతో సైబర్ నేరగాళ్లు యువతను మోసం చేస్తున్నారని హెచ్చరించారు. డేటింగ్ యాప్స్, సైబర్ బుల్లీయింగ్, సైబర్ స్టాకింగ్, మ్యాట్రిమోనియల్ ఫ్రాడ్స్, క్యూఆర్, సీసీఎం మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వాట్సాప్, టెలిగ్రామ్, సోషల్ మీడియా ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మబలికి అనధికార లింకులు, యాప్‌లు, ఏపీకే ఫైళ్లను ఇన్‌స్టాల్ చేయించి, ఓటీపీలు, బ్యాంక్ వివరాలు దోచుకుంటున్నారని తెలిపారు. అనుమానాస్పద లింకులు క్లిక్ చేయకూడదని, ఓటీపీలు, బ్యాంక్ వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. మీషో, ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వంటి ప్రముఖ సంస్థల పేర్లను దుర్వినియోగం చేస్తూ మోసాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ ఎస్ఐ రంజిత్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ ఎం. ప్రసాద్, కళాశాల ఛైర్మన్ బి. సత్యనారాయణ, వైస్ ఛైర్మన్ ఎం. రాజీవ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## కొండగట్టు ఆంజనేయస్వామి హుండీ లెక్కింపు ఆదాయం 1.79 లక్షలు

మల్యాల, జనవరి 7 (నవ జ్యోతి దినపత్రిక):

జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట –కొండగట్టు ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ అంజనేయ స్వామి వారి దేవస్థానంలో బుధవారం హుండీ లెక్కించించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మరియు ఉప కమిషనర్ టి. శ్రీకాంత రావుపర్యవేక్షణలో గత 84 రోజులకు సంబంధించి 13 హుండీలను తెరిచి భక్తుల కానుకలను లెక్కించారు. శ్రీ లలిత సేవా ట్రస్ట్ (రాజన్న సిరిసిల్ల జిల్లా) సభ్యుల సహకారంతో నిర్వహించిన ఈ లెక్కింపులో మొత్తం రూ. 1,79,35,866 (ఒక కోటి డెబ్బై తొమ్మిది లక్షల ముప్పై ఐదు వేల ఎనిమిది వందల అరవై ఆరు రూపాయలు) నగదు ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. నగదుతో పాటు భక్తులు సమర్పించిన మిశ్రమ వెండి, బంగారాన్ని సీల్ చేసి భద్రపరిచారు. వీటితో పాటు 130 నోట్ల విదేశీ కరెన్సీ కూడా లభించింది. ఈ లెక్కింపు ప్రక్రియను దేవాదాయ శాఖ జగిత్యాల డివిజన్ పరిశీలకులు రాజమౌళి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓగుండి హరిహరనాథ్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, రఘు, ఆలయ సిబ్బంది, ఏఎస్ఐ , మహిళా కానిస్టేబుళ్లు, హోంగార్డులు, బ్యాంక్ సిబ్బంది మరియు సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : సిఐ శ్రీనాథ్

మేడ్చల్,ల్లా బ్యూరో, జనవరి 7, (నవజ్యోతి దినపత్రిక) :8



శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలకు సాధారణ ప్రజానీకానికి శామీర్ పేట పోలీస్ వారు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రజలకు సంక్రాంతి పండుగ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం పండుగలు, సెలవులు వ్యక్తిగత పనుల నిమిత్తం అనేక మంది తమ ఇళ్లను విడిచి స్వగ్రామాలకు లేదా ఇతర ప్రాంతాలకు ప్రయాణిస్తున్న విషయం గమనించబడినది. ఈ తరుణంలో, ఇళ్లను ఖాళీగా ఉంచడం తగిన భద్రతా చర్యలు తీసుకోకపోవడం వల్ల ఇళ్లలో చోరీలు, వాహన దొంగతనాలు వంటి నేరాలకు అవకాశం ఏర్పడుతున్నది. గత అనుభవాల ప్రకారం, సరైన భద్రతా ఏర్పాట్లు లేని ఇళ్లు వాహనాలను నేరగాళ్లు లక్ష్యంగా చేసుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ప్రజలు గమనించవలసిన అవసరం ఉన్నది. కావున, శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలు క్రింది సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోరడమైనది. ప్రజల అప్రమత్తత పోలీసులకు అందించే సమాచారం ద్వారానే నేరాలను నివారించడం సాధ్యమవుతుందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాము. ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురికాకుండా, తమ భద్రతపై పూర్తి అవగాహనతో ఉండి పోలీసులకు సహకరించాలని కోరడమైనది. అత్యవసర సమాచారం కోసం: డయల్ 100 / 112 లేదా నేరుగా శామీర్పేట్ పోలీస్ స్టేషన్ ను సంప్రదించగలరు.




## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం బాలికల పాఠశాల అభివృద్ధికి చర్యలు

### మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు

జి.కొండూరు, జనవరి 7 (నవజ్యోతి దినపత్రిక):

జి.కొండూరు మండలం కుంటముక్కల గ్రామంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం బాలికల పాఠశాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్ సొసైటీ సెక్రటరీ ప్రసన్న వెంకటేష్ తో కలసి ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ బుధవారం కుంటముక్కల గ్రామంలోని గురుకుల పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ పేద బాలికలు చదువుకునే ఈ గురుకుల పాఠశాలలో సరైన మౌలిక వసతులు లేవన్నారు. ఇటీవల ఆకస్మిక తనిఖీలలో ఈ విషయం గుర్తించినట్లు పేర్కొన్నారు. ఇక్కడి బాలికలు ఎంతో ప్రతిభను ప్రదర్శిస్తూ పట్టుదలతో బాగా చదువుకుంటున్నారని వారికి మెరుగైన సౌకర్యాలు, సరైన వసతులు కల్పిస్తే వారు మరింత ప్రతిభావంతంగా రాణించే అవకాశం ఉందన్నారు. అందుకే ఈ పాఠశాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. ఈ గురుకుల పాఠశాల అభివృద్ధికి రూ.4 కోట్లతో చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. డార్మిటరీ, టాయిలెట్స్ సౌకర్యం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇంకా విద్యార్థినులకు ఇప్పటికే క్రీడా సామాగ్రిని అందజేశామన్నారు. మైదానం కూడా చదును చేసి పిల్లలు ఆడుకోవడానికి అనువుగా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# గురుకులాల అప్లికేషన్‌లకు అండగా లావణ్య శివకృష్ణ

### ఉచిత ఆన్లైన్ సేవలతో పేద విద్యార్థులకు ఊరట

బోనకల్, జనవరి 7 (నవజ్యోతి దినపత్రిక):





బోనకల్ గ్రామంలోని పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు గురుకుల పాఠశాలల్లో ప్రవేశం పొందేలా గ్రామపంచాయతీ 9వ వార్డు మెంబర్ లావణ్య శివకృష్ణ దంపతులు గురుకులాల అప్లికేషన్‌ల ఆన్లైన్ సేవలను పూర్తిగా ఉచితంగా అందిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. కంప్యూటర్ అవగాహన, ఇంటర్నెట్ సదుపాయాల లేమితో ఇబ్బందులు పడుతున్న గ్రామీణ విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని, అప్లికేషన్ ఫిల్లింగ్, సర్టిఫికెట్ల అప్‌లోడ్, ప్రింట్ అవుట్ తదితర సేవలను ఎలాంటి ఫీజు లేకుండా నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల విద్యార్థులు ఈ సేవల ద్వారా లబ్ధి పొందుతున్నారు. రోజూ పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ సేవలను సద్వినియోగం చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా బోనకల్ సర్పంచ్ బానోతు జ్యోతి, ఉపసర్పంచ్ కొండ లావణ్య శివకృష్ణ దంపతులను అభినందిస్తూ, వారి సేవలతో విద్యార్థులకు మంచి విద్యా భవిష్యత్తు దక్కుతుందని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు కూడా ఈ దంపతుల సేవాభావాన్ని కొనియాడుతున్నారు.



# అత్తే హంతకురాలు!

### మహిళ హత్య కేసును ఛేదించిన రెడ్డిగూడెం పోలీసులు

మైలవరం, జనవరి 7 (నవజ్యోతి దినపత్రిక):

రెడ్డిగూడెం మండలం రాఘవపురంలో ఈనెల 5న అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన మహిళ శ్రావణిని హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ హత్యకు ఆమె అత్త పద్మావతే కారణమని సీఐ చంద్రశేఖర్ వెల్లడించారు. అత్తఉ కోడళ్ల మధ్య నెలకొన్న కుటుంబ కలహాలే హత్యకు ప్రధాన కారణమని తెలిపారు. శ్రావణిని హత్యకు పాల్పడిన పద్మావతితో పాటు హత్యకు సహకరించిన కోటమ్మను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచనున్నట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

# బాధిత కుటుంబాలకు బీజేపీ నేత డాక్టర్ రఘు పరామర్శ

మెట్ పల్లి ప్రతినిధి, జనవరి 7 (నవజ్యోతి దినపత్రిక):



బీజేపీ రాష్ట్ర నాయకులు, నిత్య సాయి చారిటబుల్ ట్రస్ట్ వ్యవ స్థాపకులు డాక్టర్ చిట్నేని రఘు బుధవారం పలువురు బాధ్యత కుటుంబాలను పరామర్శించారు. మెట్ పల్లి బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు బొడ్ల రమేష్ ఇటీవల ఆయన తండ్రి బొడ్ల చిన్న గంగారాం మృతి చెందగా బీజేపీ రాష్ట్ర నాయకులు, నిత్య సాయి చారిట బుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ చిట్నేని రఘు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మెట్ పల్లి పట్టణంలోని వారి నివాసంలో ద్వాదశ దినకర్మ కార్యక్రమానికి హాజరై స్వర్గీయ బొడ్ల చిన్న గంగా రాం చిత్రపటానికి ఘన నివాళు లర్పించారు. ఆయన మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. అదేవిధంగా ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు సురిగి శ్రీనివాస్ ఇటీవల మాతృవియోగం చెందగా వారి కుటుంబ సభ్యులను సైతం బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ చిట్నేని రఘు పరామర్శించి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు చింతల శ్రీకర్ గౌడ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుగ్గిళ్ళ తుకారాం గౌడ్, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి సుంకేట విజయ్, పట్టణ సహాయ కార్యదర్శి బొడ్ల ఆనంద్, బొడ్ల అంజయ్య తదితరులు ఉన్నారు.

## జగిత్యాల జిల్లా కలెక్టర్ ని మర్యాదపూర్వకంగా కలిసిన కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

జగిత్యాల జిల్లా బ్యూరో (నవజ్యోతి దినపత్రిక):

నియోజకవర్గానికి సంబంధించిన పలు ప్రజా సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. మెట్ పల్లి కోరుట్ల మున్సిపాలిటీ లో ఓటర్ లిస్టులో ఉన్న లోపాలు, అభ్యంతరాలపై చర్చించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పలు గ్రామాల్లో తాగునీటి అవసరాల దృష్ట్యా కొత్త బోరింగ్లు మంజూరు చేయాలని కోరారు.. మన ఊరు ఉ మనబడి నిధులు మంజూరు చేయాలని తెలిపారు. ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను ఈజీఎస్‌కు మార్చి, ఏఎస్సార్ తండా, పాటిమీది తండాలలో గ్రామ పంచాయితీ భవనాల నిర్మాణం చేపట్టాలని తెలిపారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు విడుదల చేయాలని, అలాగే హెల్త్ సబ్ సెంటర్లకు సంబంధించిన నిధులు వెంటనే మంజూరు చేయాలని విన్నపం చేశారు.



# మనుమయ (కమ్మరి, వడ్రంగం) సంఘం జనగామ జిల్లా అధ్యక్షునిగా దీగోజు. సాంబచారి ఏకగ్రీవ ఎన్నిక



**జనగామ, జనవరి 7 (నవ జ్యోతి దినపత్రిక):**

తెలంగాణ రాష్ట్ర విశ్వకర్మ మనుమయ సంఘం విస్తృతస్థాయి సమావేశం జనగామ జిల్లా కేంద్రంలో విశ్వకర్మ సంఘం జిల్లా అధ్యక్షులు దీగోజు నరసింహా చారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర మనుమయ సంఘం అధ్యక్షులు సుంకోజు కృష్ణమాచారి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ నేడు కమ్మరి వడ్రంగి వృత్తిదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగింది అన్నారు. 15 అంశాలతో కూడిన నివేదికను ముఖ్యమంత్రికి అందజేయడం జరిగింది అని హెల్త్ ఇన్సూరెన్స్ తో పాటు లైఫ్ ఇన్సూరెన్స్ అందించి 50 సంవత్సరాలకు పైబడిన వారికి పెన్షన్ 5000 రూపాయలు అందజేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటికొండ శ్రీరాములు, కోశాధికారి గ్రంథల శ్రీనివాస్ చారి, సోషల్ మీడియా చైర్మన్ మేడోజు శంకరాచారి, ప్రచార కార్యదర్శి మేడోజు రాం బ్రహ్మం, బీసీ జేఏసీ రాష్ట్ర కోకన్వీనర్ అనంతోజు బ్రహ్మాచారి, పాల్గొనగా జిల్లాలోని అన్ని మండలాల నుండి అధిక సంఖ్యలో విశ్వకర్మ కమ్మరి వడ్రంగి వృత్తిదారులు హాజరైనారు ఈ సమావేశంలో జిల్లా కమిటీ ని నియమించారు. జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షులుగా దీగోజు నరసింహా చారి, జిల్లా అధ్యక్షునిగా దీగోజు సాంబాచారి, ప్రధాన కార్యదర్శిగా సాతెల్లి రాజు, కోశాధికారి మారపల్లి శ్రీనివాస్ చారి, ఉపాధ్యక్షులుగా బండ్ల మల్లేష్ చారి, ప్రచార కార్యదర్శి చెల్లోజు నవీన్ కుమార్ ని నియమించినారు.

# ఎమ్మెల్సీ కవిత రాజీనామా ను ఆమోదించిన మండలి చైర్మన్ సుఖేందర్ రెడ్డి

**హైదరాబాద్ ప్రతినిధి టి.రాజగోపాల్, జనవరి 7 (నవజ్యోతి దినపత్రిక):**



TELANGANA LEGISLATIVE COUNCIL

Sub: TELANGANA LEGISLATIVE COUNCIL - Resignation of Smt. Kalvakuntla Kavitha, Member elected from Nizamabad Local Authorities' Constituency - Notification - Issued.

* * *

The following notification shall be published in an extraordinary issue of the Telangana Gazette dated the 6th January, 2026:

LEGISLATURE (COUNCIL-LEGN.) SECRETARIAT

NOTIFICATION

C. No.14/Council-Legn./2026

"Smt. Kalvakuntla Kavitha, an elected Member of the Telangana Legislative Council from Nizamabad Local Authorities' Constituency has resigned to her seat and the resignation has been accepted by the Hon'ble Chairman, Telangana Legislative Council with effect from 06.01.2026.

Consequently, a vacancy has arisen in the Telangana Legislative Council from "Nizamabad Local Authorities' Constituency."

Hyderabad
Dt.06.01.2026.

Dr. V. NARASIMHA CHARYULU,
SECRETARY TO LEGISLATURE.

తెలంగాణ శాసనమండలి సభ్యురాలుగా ఉన్న ఎమ్మెల్సీ కవిత రాజీనామాను మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అధికారికంగా ఆమోదించారు ఈ మేరకు ఎమ్మెల్సీ పదవీ కాళీ అయినట్లు శాసనమండలి కార్యదర్శి నోటిఫికేషన్ విడుదల చేశారు. కవిత గతేడాది సెప్టెంబర్ 3 వ తేదీన తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసినదే అయితే పరిపాలన ప్రక్రియల నేపథ్యంలో ఆమె రాజీనామా పై తుది నిర్ణయం ఆలస్యంగా తీసుకోగా నేడు చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి రాజీనామాను ఆమోదించారు. నిజామాబాద్ స్థానిక సంస్థల కోటా నుండి ఎమ్మెల్సీగా ఎన్నికైన కవితా తన రాజకీయ కార్యకలాపాల దృష్ట్యా, వ్యక్తిగత కారణాలతోనే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసినట్లు అప్పట్లో వెల్లడించారు. ఆమె రాజీనామా ఆమోదంతో నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానం అధికారికంగా కాలి అయినట్లు ప్రకటించారు. ఖాళీ అయిన ఈ స్థానానికి సంబంధించి ఎన్నికల ప్రక్రియ పై త్వరలోనే ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు ఇప్పటికే ఈ స్థానంపై ప్రధాన రాజకీయ పార్టీల చర్చ మొదలైనట్లు సమాచారం. కవిత రాజీనామా ఆమోదం నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాల్లో మరో కీలక పరిణామంగా ఇది మారింది ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ సమీకరణకరణాలు మరింత ఆసక్తికరంగా మారన్నాయని తెలుస్తుంది.



# ప్రతి ఒక్క అర్హునికి ఇందిరమ్మ ఇండ్లు

**బీర్కూర్, జనవరి 7 (నవజ్యోతి ప్రతినిధి):**

తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం బీర్కూర్ గ్రామపంచాయతీ పరిధిలో గ్రామ సర్పంచ్ అరిగే ధర్మతేజ ఇండ్ల మార్కింగ్ వెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పరమేష్ పంతులు,పంచాయతీ సెక్రటరీ గంగారం,నాయకులు శశికాంత్, సంతోష్,వార్డు సభ్యులు కోరిమే రఘు, మెంటే మధు,కొర్రి ప్రశాంత్ యాదవ్, మెలిగే మహేష్, మద్నూర్ శంకర్, నాయకులు శివ యాదవ్, బాలకృష్ణ, రాములు, బస్వంత్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



# రుణ మాఫీ చేయట్లేదని కాంగ్రెస్ ప్రభుత్వంపై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన రైతు

**హైదరాబాద్ ప్రతినిధి టి.రాజగోపాల్, జనవరి 7 (నవజ్యోతి దినపత్రిక):**

రూ.2 లక్షల లోపు రుణం ఉన్నవారికి రుణమాఫీ చేస్తున్నట్లు జీవో విడుదల చేసినా తనకు రుణమాఫీ కాలేదని హైకోర్టు లో పిటిషన్ దాఖలు యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం జంగారెడ్డిపల్లి గ్రామంలో తనకున్న వ్యవసాయ భూమిపై, అరూర్ గ్రామంలోని కెనరా బ్యాంకులో రూ.1.50 లక్షల రుణం తీసుకున్న నరసింహారెడ్డి అనే రైతు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల లోపు ఉన్న వారికి రుణమాఫీ చేస్తున్నట్లు జీవో 567 విడుదల చేసిందని, కానీ తన రుణం మాఫీ కాలేదని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన రైతు కౌంటర్ దాఖలు చేసేందుకు ప్రభుత్వం తరపు న్యాయవాది సమయం కోరడంతో విచారణ వాయిదా వేసిన తెలంగాణ హైకోర్టు తదుపరి విచారణ బుధవారం కి వాయిదా వేసింది.

# బీర్కూర్ తండా నూతన సర్పంచ్ కాట్రోత్ దేవి సింగ్‌ను సన్మానిస్తున్న - శశికాంత్

**బీర్కూర్, జనవరి 7 (నవజ్యోతి ప్రతినిధి):**




బీర్కూర్ మండలం బీర్కూర్ తండా గ్రామపంచాయతీ లో ఏకగ్రీవంగా సర్పంచిగా ఎన్నికైన కాట్రోత్ దేవిసింగ్‌ను మర్యాదపూర్వకంగా శాలువాతో సన్మానించిన బీర్కూర్ మండల కాంగ్రెస్ నాయకులు మియ్యాపురం శశికాంత్. ఈ కార్యక్రమం లో మియ్యాపురం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి బాగోతం బయటపడింది

**డబ్బులు తీసుకుంటూ కెమెరాకు చిక్కిన జిన్నారం ఆర్ఐ**

**పటాన్చెరు(జిన్నారం), జనవరి 7 (నవజ్యోతి దినపత్రిక):**




జిన్నారం మండలం గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని ఓ భూ సమస్య పరిష్కారం కోసం డబ్బులు డిమాండ్ చేస్తూ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జయప్రకాశ్ కెమెరాకు చిక్కిన ఘటన కలకలం రేపుతోంది. ఓ వ్యక్తి నుంచి డబ్బులు తీసుకుంటున్న దృశ్యాలు వీడియో రూపంలో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ ఘటనపై స్థానికుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. గతంలో కూడా ఆర్ఐ జయప్రకాశ్‌పై అవినీతి ఆరోపణలు ఉన్నాయని, అయినప్పటికీ చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజా వీడియో బయటకు రావడంతో అధికారులపై ప్రజలు ప్రశ్నలు సంధిస్తున్నారు. ఆర్ఐపై వెంటనే కఠిన చర్యలు తీసుకుని, సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు.



# వైద్యం పవన్ చేతుల మీదుగా క్యాలెండర్ ఆవిష్కరణ

**సదాశివపేట, జనవరి 7 (నవజ్యోతి దినపత్రిక):**

సదాశివపేటలోని 11వ వార్డులోని ప్రభు మందిరంలో వైద్యం పవన్ ఆధ్వర్యంలో 11వ వార్డు ప్రజల చేత క్యాలెండర్ ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా వైద్యం పవన్ మాట్లాడుతూ 2026 సంవత్సరం వార్డులోని ప్రజలందరికీ కలిసి రావాలని, మాణిక్య ప్రభు చల్లని దీవాలందరిపై ఉండాలని కోరుకుంటున్నన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు చిదానందం, చంద్రశేఖర్, మనోహర్, సుధాకర్, విశ్వేశ్వర్,సత్యనారాయణ, మల్లికార్జున్,ధీరజ్,సాయి,తిళ్ళు,విజయ్,ఆకాష్,శివ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ వైస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్‌కు ఆహ్వాన పత్రిక



**సదాశివపేట, జనవరి 7 (నవజ్యోతి దినపత్రిక):**

సదాశివపేటలో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో 14వ తేదీ నాడు అయ్యప్ప స్వామి స్వర్ణ ఆభరణాల ఊరేగింపు సందర్భంగా మాజీ వైస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ కు అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రిక ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి అధ్యక్షులు గోనే శంకర్, ఉపాధ్యక్షులు సుధాకర్ ఆర్ఐ, పెద్ద గౌడ్ నరసింహ గౌడ్, జయ రాములు గౌడ్ అయ్యప్ప సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పేటలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం

**పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్, టీజిఐఐసి చైర్మన్ తూర్పు నిర్మల జగ్గారెడ్డి**

**జనవరి 7 (నవజ్యోతి దినపత్రిక):**

సదాశివపేట పట్టణ అభివృద్ధిలో భాగంగా టీయుఎఫ్ఐడిసి నిధులతో పాత మున్సిపాలిటీ కార్యాలయ భవన నిర్మాణం,యన్ హెచ్ 65 నుండి ఎమ్మార్వో కార్యాలయం వరకు డివైడర్,సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు కోసం శంకుస్థాపన, సిద్ధాపూర్ రోడ్ లో సెంటర్ లైటింగ్ ప్రారంభోత్సవ కార్యక్రమలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పాల్గొని పనులకు అధికారికంగా ప్రారంబించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడం వల్ల రాత్రి వేళల్లో వెలుతురు సమస్య తొలగి ప్రజలకు భద్రత మరింత మెరుగుపడనుందని తెలిపారు. ఈ లైటింగ్ ద్వారా రవాణా సౌలభ్యం పెరిగి, ప్రమాదాలు తగ్గే అవకాశం ఉందని అన్నారు. పట్టణాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, మాజీ కౌన్సిల్ సభ్యులు మున్సిపల్ అధికారులు, పట్టణ నాయకులు పాల్గొనడం జరిగింది.



# రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో గుమ్మడిదల విద్యార్థిని ప్రతిభ

**పటాన్చెరు (గుమ్మడిదల), జనవరి 07(నవజ్యోతి దినపత్రిక):**




రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో గుమ్మడిదల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని లక్ష్మి ప్రసన్న తన ప్రతిభను చాటుకుంది. ఉపాధ్యాయురాలు శోభారాణి మార్గనిర్దేశంలో లక్ష్మి ప్రసన్న 'స్మోక్ క్యాప్చర్ల ప్రాజెక్టును ప్రదర్శించింది. పర్యావరణ కాలుష్య నియంత్రణ లక్ష్యంగా రూపొందించిన ఈ ప్రాజెక్టు రాష్ట్రస్థాయి ప్రదర్శనలో సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. పాఠశాల స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రతిభ కనబరిచిన లక్ష్మి ప్రసన్నను ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు అభినందించారు. ఈ విజయం గుమ్మడిదల మండలానికి గర్వకారణంగా నిలిచిందని వారు తెలిపారు.

# భక్తజనసంద్రంగా మారిన నస్కల్ గ్రామం

**ఉమా శంకర్ రెడ్డి గురుస్వామి**

**చేవెళ్ల, జనవరి 07 (నవజ్యోతి దినపత్రిక):**



బుధవారం ఉదయం నస్కల్ గ్రామంలో మండల దీక్ష పూర్తి చేసుకున్న స్వాముల ఇరుముడి కార్యక్రమం తో నస్కల్ గ్రామం భక్తజనసంద్రంగా మారింది. బుధవారం రోజు ఉదయాన్నే ఉమా శంకర్ రెడ్డి గురు స్వామి చేతుల మీదుగా మండల దీక్ష పూర్తి చేసుకున్న 25 మంది నస్కల్స్ సన్నిధానం స్వాములు స్వామివారి అభిషేకార్థమై స్వచ్ఛమైన ఆవు నెయ్యితో నింపిన ఇరుముడి కార్యక్రమాన్ని ఉమా శంకర్ రెడ్డి గురుస్వామి నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వామి మాట్లాడుతూ శ్రీ శ్రీ అయ్యప్ప స్వామి వారి దీక్షలో ఒక నాలుగు సందర్భాలు దీక్ష తీసుకున్న స్వాములకు ఎంతో పవిత్రమైనవిగ భావిస్తామని అందులో మొదటిది శ్రీ స్వామి వారి దీక్ష స్వీకరణ రెండవది శ్రీ స్వామివారి ఇరుముడి కార్యక్రమం మూడవది శ్రీ స్వామి వారి దివ్య దర్శనం నాల్గవది శ్రీ స్వామివారి దీక్ష విరమణ ఈ నాలుగు సందర్భాలు కూడా సాధ్యమైనంత వరకు ప్రాతఃకాలంలోనే నిర్వహించే విధంగా చూడాలని ఈ రోజుల్లో స్వాముల సంఖ్య పెరగడంతో ఇరుముడి కార్యక్రమం అనేది ప్రాత కాలంలో పూర్తి కావడం కొద్దిగా ఇబ్బందికరంగా మారిందని ఏది ఏమైనా శ్రీ స్వామివారి దర్శనార్థమై ఇరుముడి కార్యక్రమం తో బయలుదేరుతున్న స్వాములకు స్వామివారి దివ్యదర్శనం సులభతరంగా జరిగే విధంగా అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన అయ్యప్ప స్వామి వారు వారిని కరుణించి ముందుకు నడిపించాలని గత 25 సంవత్సరాలుగా నస్కల్ గ్రామంతో నాకున్న అనుబంధం గత 15, 16 సంవత్సరాలుగా ఈ గ్రామంలో ప్రతి సంవత్సరం జనవరి ఏడో తారీఖు రోజునే ఇరుముడి కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని నస్కల్ గ్రామంలో ప్రతి ఇంట్లో ఎప్పుడూ ఒకప్పుడు శ్రీ స్వామివారి దీక్ష తీసుకున్న స్వాములు ఉంటారని మరి అంతటి భక్తి ప్రపత్తులు కలిగిన ఈ నస్కల్ గ్రామంతో నాకున్న అనుబంధం ఎన్నడూ విడిపోనిదని, విడదీయలేనిదని ఉమాశంకర్ రెడ్డి గురుస్వామి అన్నారు. ఈ కార్యక్రమంలో మన గురు స్వామి సన్నిధానం స్వాములు పురుషోత్తం రెడ్డి గురుస్వామి, రాఘవేందర్ రెడ్డి కన్నె స్వామి, కార్తీక్ ఘంటా స్వామి, నస్కల్ సన్నిధానం గురు స్వాములు శేఖర్ స్వామి, దస్తయ్య స్వామి, ప్రభాకర్ స్వామి, కోస్గి మల్లేష్ స్వామి, రాఘవాచారి స్వామి, వినయ్ భరత్ స్వామి, భాగయ్య స్వామి, ఇంకా సన్నిధానం గురుస్వాములు, స్వాములు, గ్రామ ప్రజలు, బంధువులు మిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని గ్రామంలో ఒక పండుగ వాతావరణాన్ని ఒక సందడి వాతావరణాన్ని స్వామివారి శరణు ఘోషలతో ఒక అద్భుతమైన ఆధ్యాత్మికత భావనలను గ్రామమంతా విధంగా చేశారని మరి ఇంతటి మహిమాన్వితమైన శ్రీ శ్రీ అయ్యప్ప స్వామి వారి దీక్షలు ఎన్నడు మరువకూడదని మర్చిపోలేవద్దని మన శక్తి మేరకు సాధ్యమైనన్ని రోజులు స్వామివారి దీక్షలు స్వీకరించేందుకు సంసిద్ధులమై స్వామివారి సేవలో నిరంతరం పాటుపడే విధంగా మనమందరం ముందుకు నడవాలని గురుస్వామి పూజా కార్యక్రమంలో పాల్గొన్న స్వాములకు భక్తులకు గ్రామ ప్రజలకు తెలియజేశారు.



## క్రీడా వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

**బీర్కూర్, జనవరి 7 (నవజ్యోతి ప్రతినిధి):**

బాన్సువాడ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కో ఎడ్యుకేషన్ క్రీడా మరియు వార్షికోత్సవం సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మెన్ కాసుల బాలరాజు. ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మరియు వార్షికోత్సవం సందర్భంగా క్రీడలలో పాల్గొన్న విద్యార్థిని విధ్యార్థులకు బహుమతులు ప్రదానం చేసిన పోచారం శ్రీనివాస్ రెడ్డి అనంతరం విద్యార్థినిలు ప్రదర్శించిన నృత్యాలను తిలకించారు. ఈకార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం, నాయకులు కృష్ణారెడ్డి, అబ్దుల్ ఖాలేఖ్, ఎజాస్, నార్ల సురేష్, పిట్ల శ్రీధర్, మోహన్ నాయక్, గోపాల్ రెడ్డి, నార్ల రవీందర్, యండి. దావూద్, దాసరి శ్రీనివాస్, నార్ల ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

## బీర్కూర్ తహసిల్దార్‌గా సవాయి సింగ్

**బీర్కూర్, జనవరి 7 (నవజ్యోతి ప్రతినిధి):**



కామారెడ్డి జిల్లా లో పలువురు తహసిల్దార్ లను బదిలీ చేస్తూ కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిషి సంగ్వాన్ ఉత్తర్వులు జారీ చేశారు. బీర్కూర్ తహసిల్దార్ గా విధులు నిర్వహిస్తున్న సాయి భుజంగరావ్ ను నిజాంసాగర్ మండలానికి బదిలీ చెయ్యగా ఎల్లారెడ్డి ఆర్.డి.ఓ కార్యాలయం లో అసిస్టెంట్ డెవలప్మెంట్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్న సవాయి సింగ్ ను బీర్కూర్ తహసిల్దార్ గా బదిలీ పై వచ్చి బుధవారం బాధ్యతలు స్వీకరించారు.



## బహిరంగ ప్రదేశాలలో అసాంఘిక కార్యక్రమాల పై చర్యలు తీసుకుంటాం

### సర్పంచ్ హరిత కృష్ణారెడ్డి

**చేవెళ్ల, జనవరి 7 (నవజ్యోతి దినపత్రిక):**

సర్పంచ్ బద్దం హరిత కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో టంగుటూరు గ్రామ క్రీడాప్రాంగణంకి గేట్ వేపియడం జరిగింది. క్రీడా ప్రాంగణంలో ఆసుపత్రి పరిసర ప్రాంతాలలో అసాంఘిక కార్యక్రమాలైన మద్యపానం, ధూమపానం చేస్తున్నట్లు సర్పంచ్ హరిత క్రిష్ణ రెడ్డి దృష్టికి రావడం తో తాను వెంటనే క్రీడా ప్రాంగణం లో ని పొదలను తొలగించి నూతన గేట్ ని క్రీడా ప్రాంగణం కి ఏర్పాటు చేశారు. ఇప్పటినుండి క్రీడా ప్రాంగణంలో గాని ఆసుపత్రి పరిసర ప్రాంతాలలో అసాంఘిక కార్యక్రమాలైన మద్యపానం, ధూమపానం చేసినట్లయితే చట్టరీత్యా చర్యలు తీసుకోబడతాయి అని సర్పంచ్ హరిత క్రిష్ణ రెడ్డి తెలిపారు. బహిరంగ ప్రదేశాలలో ఎటువంటి అవాంఛనీయ కార్యక్రమాలు చేపట్టిన వారిపై కఠిన చర్యలు చేపడతామని అన్నారు. హాస్పటల్ మరియు క్రీడా ప్రాంగణం ఆవరణంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని ఎప్పటికప్పుడు సీఐ పర్యవేక్షణలో చూడడం జరుగుతుందని అన్నారు.



## నూతనంగా బదిలీపై వచ్చిన తహసిల్దార్‌ను కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**బీర్కూర్, జనవరి 7 (నవజ్యోతి ప్రతినిధి):**

ఎల్లారెడ్డి ఆర్.డి.ఓ కార్యాలయం లో అసిస్టెంట్ డెవలప్మెంట్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్న సవాయి సింగ్ బీర్కూర్ తహసిల్దార్ గా బదిలీ పై వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు వారికి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ పరమేష్ పంతులు,నాయకులు అవారి గంగారం,శశికాంత్,మేకల విట్టల్,సందీప్, నాందేవ్, వార్డు సభ్యులు హైమద్, ప్రశాంత్, రఘు, మెంటే మధు, భాస్కర్, మహేష్, మద్నూర్ శంకర్, ఆనంద్, పృథ్వీ గౌడ్, అప్సర్ తదితర నాయకులు పాల్గొన్నారు.




## ఉపాధ్యాయ సమస్యల పరిష్కారాన్ని కృషి

### శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

**చేవెళ్ల, జనవరి 7 (నవజ్యోతి దినపత్రిక):**

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. బుధవారం రోజున తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ క్యాలెండర్, డైరీ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టియుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి పి.రఘునందన్ రెడ్డి, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పి.మొగులయ్య సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. 2010 కంటే ముందు నియామకమైన ఉపాధ్యాయులను టెట్ ఉత్తీర్ణత నుండి మినహాయించాలని కోరారు. అదేవిధంగా ఎస్సీ , ఎస్టి ఉపాధ్యాయుల నియామకాలకు, పదోన్నతులకు అడ్డంకింగా మారిన జీవో నెంబర్ 2 రద్దు చేయాలని, పెండింగ్ బిల్లుల చెల్లింపునకు, ఆరోగ్య కార్డుల అమలుకు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. డైరీ, క్యాలెండర్ విడుదల కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రఘునందన్ రెడ్డి, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పి.మొగులయ్య, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జాంప్ల, వికారాబాద్ జిల్లా అధ్యక్షులు పి.సత్యనారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.సుదర్శన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.





# విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచడమే లక్ష్యం

### వ్యక్తిత్వ వికాస నిపుణులు అప్పల ప్రసాద్

**పటాన్చెరు(గుమ్మడిదల), జనవరి 7 (నవజ్యోతి దినపత్రిక):**

స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వ్యక్తిత్వ వికాస నిపుణులు అప్పల ప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. చదువుతో పాటు మానసిక బలం, సానుకూల ఆలోచనలు, క్రమశిక్షణ, సమయ నిర్వహణకు ప్రాధాన్యం ఎంత అవసరమో విద్యార్థులకు వివరించారు. యువతలో లక్ష్య సాధన పట్ల స్పష్టత, స్వీయ నియంత్రణ, బాధ్యతాయుతమైన ప్రవర్తన ఉంటేనే జీవితంలో ముందుకు సాగడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. స్వామి వివేకానంద ఆలోచనలు నేటి యువతకు కూడా మార్గదర్శకంగా నిలుస్తున్నాయని వివిధ ఉదాహరణల ద్వారా వివరిస్తూ విద్యార్థుల్లో ప్రేరణ కలిగించారు. ఈ కార్యక్రమంలో సుమారు 800 మంది విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన పలు అంశాలపై సందేహాలు వ్యక్తం చేశారు. రేపటి తమ భవిష్యత్తుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పోలినీ రెడ్డి, మైత్రి ఫౌండేషన్ చైర్మన్ చెన్నంశెట్టి ఉదయ్ కుమార్, పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.




# చౌటకూర్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం

**చౌటకూర్, జనవరి 7 (నవజ్యోతి దినపత్రిక):**

మన హాస్పిటల్ ఆధ్వర్యంలో చౌటకూర్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో అనుభవజ్ఞులైన వైద్యులు పాల్గొని గ్రామస్తులకు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తపోటు, మధుమేహం, హృదయ సంబంధిత వ్యాధులతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలపై పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచిత మందులు పంపిణీ చేశారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై శిబిరాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కృష్ణ నేహా, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సాయి కృష్ణ, డాక్టర్ సువాస్, డాక్టర్ అజయ్, మార్కెటింగ్ మేనేజర్ మనోజ్ కుమార్, ఆసుపత్రి సిబ్బంది, సర్పంచ్ రామ్ రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జి.కొండూరులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కృష్ణప్రసాదు

**జి.కొండూరు, జనవరి 7 (నవజ్యోతి దినపత్రిక):**

జి.కొండూరులో పలు అభివృద్ధి పనులకు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు బుధవారం శంకుస్థాపన చేశారు. కొత్తూరు రోడ్డులో సచివాలయం-2 పక్కన15వ ఆర్థికసంఘం నిధులు రూ.36 లక్షలతో హెల్త్ సెంటర్ నిర్మాణానికి, రూ.20 లక్షల ఎన్ఆర్ఈజిఎస్ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. గోకులం షెడ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ పల్లెపండుగ 2.0 కార్యక్రమం కింద అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), స్థానిక ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.






# రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలి

### సీనియర్ సివిల్ జడ్జి జి.సబిత

**రామన్నపేట, జనవరి 7 (నవజ్యోతి దినపత్రిక):**

రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ జి.సబిత తెలిపారు. రోడ్డు రవాణా భద్రత మాసోత్సవాల సందర్భంగా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ (యాదాద్రి భువనగిరి జిల్లా) ఆదేశాల మేరకు, మండల న్యాయ సేవా అధికార సంస్థ రామన్నపేట ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ సివిల్ జడ్జి జి. సబిత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. శిరీష, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ డి. సత్తయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని, కాలినడకన వెళ్లేటప్పుడు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రైవింగ్ చేసే ప్రతి ఒక్కరూ హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే మోటార్ వాహన చట్టం ప్రకారం శిక్షలకు లోనవుతారని, 18 సంవత్సరాలు దాటినవారే డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని స్పష్టం చేశారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే తల్లిదండ్రులు కూడా శిక్షకు గురవుతారని హెచ్చరించారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను గమనిస్తూ రోడ్డు దాటాలని, సిగ్నల్స్‌కు అనుగుణంగా వాహనాలు నడపాలని సూచించారు. అనంతరం రోడ్డు రవాణా భద్రత మాసోత్సవాల సందర్భంగా హాజరైన వారందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు హర్షవర్ధన్ రెడ్డి, ప్రణీత్ రెడ్డి, తహశీల్దార్ లాల్ బహదూర్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్. వెంకటేశ్వర్లు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.ఏ. మసీద్, ఏజీపీ సుక్క శ్రావణ్ కుమార్, సీనియర్ అడ్వకేట్ జినుకల ప్రభాకర్, ప్యానల్ అడ్వకేట్లు బి. డేవిడ్, మామిడి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే విద్యాశాఖ అధికారులు, పోలీస్, కోర్టు సిబ్బంది, లీగల్ సర్వీసెస్ టీమ్ సభ్యులు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్. జగదీష్, వివిధ పాఠశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## సాయి దృష్టి అందుల ఆశ్రమంలో అన్నదానం

**మంచిర్యాల ప్రతినిధి, జనవరి 7 (నవజ్యోతి దినపత్రిక):**

శ్రీరాంపూర్ ప్రాంతానికి చెందిన శ్రీపతి రాములు-కల్పన దంపతుల ఏకైక కుమార్తె శ్రీపతి కీర్తి పుట్టిన రోజును కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక సాయి దృష్టి అందుల పాఠశాల వృద్ధాశ్రమంలో బుధవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు భోజనం ఏర్పాటు చేశారు. పుట్టినరోజు ఇతర శుభకార్యాలను బంధుమిత్రులతో ఆర్భాటంగా జరుపుకుంటున్న ఈ రోజుల్లో వృద్ధాశ్రమంలో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం పట్ల పలువురు అభినందించారు. ఆశ్రమంలోని వృద్ధులు శ్రీపతి కీర్తికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ నిండు నూరేళ్ళు అష్టైశ్వర్యాలతో ఘనంగా గడపాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా శ్రీపతి రాములు-కల్పన దంపతులు మాట్లాడుతూ తమ కుమార్తె పుట్టిన రోజును వృద్ధాశ్రమంలో జరుపుకోవడం సంతోషంగా ఉందని, ప్రతిఒక్కరి తమకు తొచిన విధంగా నిరాదరణకు గురైన వృద్ధులకు సహాయ, సహకారాలు అందించాలని కోరారు.

# శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో హుండీ లెక్కింపు

**పటాన్చెరు (బీరంగూడ), జనవరి 7 (నవజ్యోతి దినపత్రిక):**

సంగారెడ్డి జిల్లా బీరంగూడ జీహెచ్ఎంసీ పరిధిలోని బీరంగూడ గుట్టపై వెలసిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో 118 రోజుల హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమం పరిశీలకులు ఈఓ శ్రీనివాస్ సమక్షంలో, ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్, ఆలయ ఈవో శశిధర్ గుప్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని హుండీ లెక్కింపులో సహకరించారు. హుండీ లెక్కింపులో మొత్తం రూ.10,04,280 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో శశిధర్ గుప్త తెలిపారు. ఈ మొత్తాన్ని ఆలయ ఖాతాలో జమ చేసి, రాబోయే మహాశివ రాత్రి ఉత్సవాలకు, జాతర నిర్వహణకు వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ, భక్తుల సహకారంతో పూర్తిగా పారదర్శకంగా



హుండీ లెక్కింపు నిర్వహించామని తెలిపారు. ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు, ఉత్సవాల నిర్వహణకు ఈ నిధులు ఉపయోగపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జున రెడ్డి, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు దండు రమేష్, చంద్రశేఖర్, లక్ష్మకాంత్ రావు, దీపక్ గౌడ్, శ్రీనివాస్ జె, ఎల్లయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి యువత స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

**మోమిన్ పేట సీఐ జి, వెంకట్**

**మోమిన్ పేట, జనవరి 7 (నవజ్యోతి దినపత్రిక):**

నేటి సమాజంలో యువత ప్రభుత్వ ఉద్యోగులపై ఆధారపడకుండా స్వయం ఉపాధి అవకాశాలపై దృష్టి సారించి ఆర్థికంగా ఎదగాలని, సిఐ, జి వెంకట్ అన్నారు. బుధవారం నాడు మోమిన్పేట్ మండల కేంద్రంలోని నూతనంగా దుర్గాభవాని హోటల్లు ప్రారంభించారు.ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా యువత స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలన అన్నారు. మాట్లాడుతూ.. యువత ప్రైవేట్ రంగాల్లో అందివస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ, మరింత మందికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారూ. ముఖ్యంగా యువత చెడు మార్గాలను ఎంచుకోకుండా మంచి ఆదాయ మార్గాలు ఎంచుకొని



అందులో స్థిరపడాలని యువతకు పిలుపునిచ్చారు. తప్పనిసరిగా హెూటల్ ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని యజమానులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు బండ విష్ణువర్ధన్ రెడ్డి. శ్రీకాంత్ గౌడ్. టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు డబ్బాడి వెంకట్. నాయకులు సుభాష్ గౌడ్. ఖదీర్. రవీందర్ రెడ్డి. విష్ణువర్ధన్ రెడ్డి. సిరాజుద్దీన్. అప్సర్.రవి. ప్రభు గౌడ్. బ్రహ్మానంద రెడ్డి. శోభన్. వార్డు సభ్యులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

# ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

**జాతీయ రోడ్ సేఫ్టీ వారోత్సవాల్లో విద్యార్థులకు అవగాహన**

**పటాన్చెరు(వావిలాల), జనవరి 7 (నవజ్యోతి దినపత్రిక):**

జాతీయ రోడ్ సేఫ్టీ భద్రతా వారోత్సవాలలో భాగంగా గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో వావిలాల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బుధవారం రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ గౌతం, ఎంఈఓ విజయ్ కుమార్ పాల్గొని విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రాముఖ్యత, మోటార్ వెహికల్ చట్టంపై




విస్తృతంగా అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలను నివారించడంలో జాగ్రత్తలు, హెల్మెట్ వినియోగం, లైసెన్స్ అవసరం వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జ్ హెడ్మాస్టర్ రాజారావు, ఉపాధ్యాయ బృందం మొత్తం పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సమాచార హక్కు చట్టం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎన్నికైన సోమారపు రవికిఘనంగా సన్మానం

**మోహన్ పేట, జనవరి 7 (నవజ్యోతి దినపత్రిక):**

మోమిన్పేట్ మండల కేంద్రం చెందిన సోమారపు రవికి సమాచార హక్కు చట్టం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమించినందుకు బుధవారం మండల కేంద్రంలో పి బాబు మాజీ సర్పంచుల సంఘం ఐక్యవేదిక అధ్యక్షులు కొనింటి సురేష్ తో , పడాల శ్రీకాంత్,పలువురు నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజా సమస్యల కోసం సమాచారాన్ని తెలుసుకొని ప్రజల సమస్యల పరిష్కరించడం సులభం అవుతుందన్నారు.



# అన్ని జీవరాసుల కెల్లా మానవ జీవితం అమూల్యమైనది

- **భగవంతుడు ఇచ్చిన జీవితాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి వ్యక్తి పైన ఉంది.**
- **మీ క్షమమే మా బాధ్యత.**
- **వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా.**

**మోమినిపేట, జనవరి 7 (నవజ్యోతి దినపత్రిక):**

వికారాబాద్ జిల్లా రోడ్డు ప్రమాద రైతు జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరు పోలీసు శాఖకు సహకరించాలని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా అన్నారు. జీవితం అమూల్యమైనదని, అట్టి జీవితాన్ని నిర్లక్ష్యం చేయకుండా,కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి వాహనదారుని పైన ఉందని జిల్లా ఎస్పీ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాలో, భాగంగా,బుధవారం మోమినిపేట మండల కేంద్రంలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలలు ప్రధాన కూడళ్ల వద్ద, బస్టాండ్ లో మార్కెట్ ప్రాంతాల్లో ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.. రోడ్డు భద్రత మాసోత్సవాలు కేవలం ఒక నెలకు మాత్రమే పరిమితం కాకుండా, ప్రతిరోజు జీవితంలో భాగం కావాలని ఆమె పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలను అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఇవ్వాలని, తమ కుటుంబాల



సుభవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని బాధ్యతాయు తంగా మాత్రమే వాహనాలను నడపాలని ఆమె కోరారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఆమె బైక్ ర్యాలీ లో పాల్గొన్నారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ను ధరించాలని ఫోర్ వీలర్ వాహనదారులు సీట్ బెల్ట్ ను తప్పకుండా ధరించి సురక్షతంగా తమ గమ్యానికి, చేరుకోవాలని ఆమె కోరారు. టు వీలర్ వాహనదారులందరికీ హెల్మెంటును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కళ జాత బృందం చే రోడ్డు భద్రత బృందం చే పాటలు పాడారు,. వికారాబాద్ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, సిఐ,జి, వెంకట్ ఎస్సై అరవింద్ కుమార్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# బాల్యవివాహాలు అనర్థాలకు దారితీస్తాయి ఉ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రహత్ ఖానం

**రామన్నపేట, జనవరి 7 (నవజ్యోతి దినపత్రిక):**

బాల్యవివాహాల నిర్మూలన దిశగా సమాజంలో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఎంతో ఉందని రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రహత్ ఖానం స్పష్టం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా మహిళా, పిల్లల, వికలాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ విభాగం సహకారంతో కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్ఉ1, యూనిట్ఉ2ల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రహత్ ఖానం మాట్లాడుతూ, బాల్యంలో జరిగే వివాహాలు వ్యక్తిగత జీవితానికే కాదు సమాజ అభివృద్ధికీ పెద్ద అడ్డంకిగా మారుతున్నాయని పేర్కొన్నారు. చిన్న వయస్సులో పెళ్లిళ్లు చేయడం వల్ల విద్య మధ్యలోనే ఆగిపోవడం, ఆర్థికంగా వెనుకబడటం, ఆరోగ్య సమస్యలు తలెత్తడం వంటి అనేక దుష్పరిణామాలు ఎదురవుతున్నాయని వివరించారు. ముఖ్యంగా బాలికల విషయంలో బాల్యవివాహాలు వారి భవిష్యత్తును చీకట్లోకి నెట్టే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఎం. అనిత, టి. శ్రీనివాసులు మాట్లాడుతూ, బాల్యవివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అంశంపై అవగాహనతో పాటు సమాజంలో మార్పుకు చురుకైన పాత్ర పోషించాలని కోరారు. ఈ అవగాహన కార్యక్రమంలో డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, డాక్టర్ కిషన్, డాక్టర్ రాచమల్ల శ్రీను, అమర్, నరేష్, ఆంజనేయులు, రాధిక, రవి తదితర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. బాల్యవివాహాల నిర్మూలన దిశగా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగితేనే సమాజంలో సానుకూల మార్పు సాధ్యమవుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు.

# గంజాయి అమ్ముతున్న వ్యక్తులు అరెస్టు

**మేడ్చల్, జనవరి 7 (నవజ్యోతి దినపత్రిక):**

జగద్గిరిగుట్టలో గంజాయి అమ్ముతున్న సుబ్బారావు, అమర్ అనే వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధి శిరిడీ హిల్స్ ప్రాంతంలో నివసించే సుబ్బారావు అనే వ్యక్తి మహారాష్ట్ర రాయగడ్ అనే ప్రాంతం నుండి గంజాయి తరలిస్తూ జగద్గురుటపైన ఉన్న చుట్టుపక్కల బస్తీలకు అనగా షిరిడిల్స్, రాజీవ్ గృహకల్ప, కోన మహాలక్ష్మ నగర్ తులసి నగర్ ఆల్విన్ కాలనీ వెంకటేశ్వర్ నగర్ జగద్గిరి నగర్ శ్రీనివాస్



నగర్ గాజులరామారం చుట్టుపక్కల బస్తీలకు అమ్ముతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు సుబ్బారావు, అమర్ అనే వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్కు తరలించినట్లు సమాచారం. గంజాయి అమ్ముతున్న సుబ్బారావు నుండి 1.3 గంజాయి స్వాధీనం చేసుకొని రిమాండ్కు తరలించారు.



# బిజెపి రాష్ట్ర నాయకుడు కాంతారావుని కలిసిన మహిళా మోర్చా నాయకులు..

**హైదరాబాద్ ప్రతినిధి టి.రాజగోపాల్, జనవరి 7 (నవజ్యోతి దినపత్రిక):**

కూకట్ పల్లి లోని బిజెపి రాష్ట్ర నాయకులు సీనియర్ నేత కూకట్ పల్లి ఇంచార్జ్ కాంతారావు ని బాలానగర్ డివిజన్ మహిళా మోర్చా నాయకురాలు కేంసారం రూప ఆధ్వర్యంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రూపా మాట్లాడుతూ పార్టీ బలోపేతం దిశగా బాలానగర్ కూకట్ పల్లి నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటున్న ప్రతి ఒక్క కార్యకర్తలను సముచిత గౌరవం కల్పించి ముందుకు పోతున్నామని ఆమె అన్నారు. పార్టీలో ఎటువంటి కలహాలకు తావు లేకుండా భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్రంలో అధికార దిశగా ప్రతి కార్యకర్త మహిళా నాయకులు కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ డివిజన్ మహిళా మోర్చా నాయకులు కేంసారం రూప సురేందర్ రెడ్డి శంకర్ రెడ్డి శ్రీశైలం రమేష్ శ్రీనివాస్ రెడ్డి అనిష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆర్టీసీ సంక్రాంతి బస్సు చార్జీల పెంపు...

**హైదరాబాద్ ప్రతినిధి టి.రాజగోపాల్, జనవరి 7 (నవజ్యోతి దినపత్రిక):**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సంక్రాంతి పండుగ సందర్భంగా బస్సు చార్జీలు పెంచుతున్నట్లు ప్రకటించింది. 2003 లో ఇచ్చిన జీవో ప్రకారం టికెట్ ధరపై 1.5 రేట్ల వరకు సవరించామని ఆర్టీసీ పేర్కొంది. దీంతో రూ 100 ఉన్న బస్సు టికెట్ ధర 150 రూపాయలు కానుంది తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు తిరిగే స్పెషల్ బస్సులకే ఇది వర్తిస్తుందని పేర్కొంది. ఈనెల 9. 10. 11 .12 .13 తేదీలతో పాటు పండుగకు వెళ్లి తిరిగి వచ్చే ప్రయాణ రద్దీ ఎక్కువ ఉండే 18. 19 తేదీల్లో




మాత్రమే ఈ పెరిగిన చార్జీలు అమలులో ఉంటాయని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ పేర్కొంది. ఈ నిర్ణయంతో సంక్రాంతి పండుగకు ఊరు వెళ్లే పేద మధ్యతరగతి ప్రజలపై అధిక భారం పడనుంది.

